# యువ తెలంగాణ

VOICE OF TELANGANA YOUTH

హైదరాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ ★ 28 జూన్ 2025, శనివారం




## టీవీ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య

తెలుగు టీవీ యాంకర్, న్యూస్ ప్రెజెంటర్, వర్ధమాన కవయిత్రి స్వేచ్ఛ వొరాట్కర్ ఆత్మహత్య చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె తన తల్లి శ్రీదేవితో కలిసి రామ్ నగర్ లో నివాసం ఉంటుండగా జవహర్ నగర్ లోని తన నివాసానికి వెళ్లి ఉరివేసుకొని చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఆమె బాడీని గాంధీ ఆసుపత్రికి తరలించారు... స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకున్న సమాచారం తెలుసుకున్న స్నేహితులు, సన్నిహితులు భారీగా ఆసుపత్రికి చేరుకున్నారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. స్వేచ్ఛ గత 18 సంవత్సరాలుగా పలు ప్రముఖ టీవీ ఛానల్స్ లో యాంకర్ గా పనిచేస్తున్నారు. గతంలో టీవీ9లోనూ, ప్రస్తుతం టీ న్యూస్ లోనూ పనిచేస్తున్న స్వేచ్ఛ ఉత్తమ యాంకర్ గా ఎన్నో అవార్డులు అందుకున్నారు. తెలుగు సాహిత్యంలో కూడా స్వేచ్ఛ ఎన్నో రచనలు చేశారు.



## అన్నం కూడా పెట్టరా..?

4లో..



## కోడలి రేప్.. హత్య.. గోతిలో శవం

3లో..

# ఎస్.ఐ, కానిస్టేబుల్స్, జీపీఓ ఈ నోటిఫికేషన్లకు అడ్డేముంది..?

▶ కోర్టు కేసులు లేవు, ఖాళీలు చాలా గుర్తింపు ▶ నోటిఫికేషన్లు ప్రకటించాలని నిరుద్యోగుల డిమాండ్







**యువ తెలంగాణ, స్పెషల్ డెస్క్ :** తెలంగాణాలో అధికారం నుంచి బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా.. నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు మాత్రం తప్పేలా లేవు. మ్యానిఫెస్టో లోని 2 లక్షల ఉద్యోగాల్లో.. ఇప్పటికే 60వేలు భర్తీ చేశామని సీఎం రేవంత్ సహా మంత్రులందరూ ఒకటే ప్రచారం చేస్తుండగా.. అసలు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 13వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. దీనికి తోడు.. అసలు నోటిఫికేషన్లు వద్దంటూ నిరుద్యోగులు ధర్నాలు చేస్తున్నారంటూ సీఎం రేవంత్ పదే పదే ప్రకటించడంపై.. నిరుద్యోగులు అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు. ఇప్పటికే ధర్నా చౌక్ సాక్షిగా మూడు సార్లు నిరసన ప్రదర్శన నిర్వహించిన నిరుద్యోగులు.. జులై 4న సెక్రటేరియేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే.. జులై 4న తమ తడాఖా చూపించాలని.. నిరుద్యోగుల వాట్సప్ గ్రూపుల్లో.. మెసేజ్ లు.. సర్కులేట్ అవుతుండటం విశేషం.

### వివాదాలు లేని నోటిఫికేషన్లు ప్రకటించాలి :

వాస్తవానికి.. గ్రూప్ 1 లాంటి పోస్టుల భర్తీకి ప్రస్తుతం కోర్టులో నడుస్తున్న కేసులు అడ్డొస్తాయని అనుకున్నా.. అసలు ఎలాంటి అడ్డంకులు లేని.. ఎస్.ఐ, కానిస్టేబుల్స్, జీపీవో లాంటి నోటిఫికేషన్లు సైతం ఎందుకు విడుదల చేయడం లేదని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే.. 20వేలకు పైగా పోలీస్ ఉద్యోగాలు.. సుమారు 7వేలకు పైగా గ్రామ పంచాయతీ ఆఫీసర్ల పోస్టులకు ఖాళీలున్నాయి. గ్రూప్స్ పోస్టుల న్యాయ వివాదాలు తేలేంత వరకు కనీసం ఈ నోటిఫికేషన్లు వేసినా.. నిరుద్యోగులు ప్రిపరేషన్ లో మునిగిపోతారు.

### ఎస్.ఐ, కానిస్టేబుల్ కి అడ్డంకే లేదు :

గ్రూప్స్ , టీచర్ ఉద్యోగాల తర్వాత ఎక్కువ మంది నిరుద్యోగులు అప్లై చేసేది పోలీస్ ఉద్యోగాలకే. వీరిలో కూడా ఎక్కువ మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులే అధికం. ప్రతి నోటిఫికేషన్ కు.. సుమారు 8లక్షల మంది దాకా దరఖాస్తు చేసుకుంటూ ఉంటారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో, 2018లో, 2022లో మూడు సార్లు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18నెలలు దాటినా నోటిఫికేషన్ ఊసు లేకపోవడం.. ఈ ఉద్యోగాలకు ఏజ్ లిమిట్ కూడా ఉండటం వల్ల.. నిరుద్యోగులు సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నారు.

### జీపీఓల భర్తీ ఎప్పుడు..?

తెలంగాణాలో మొత్తం గ్రామ పరిపాలనా అధికారి పోస్టులకు 10, 954 ఖాళీలను గుర్తించారు. వీటిలో కొన్నింటిని.. పాత వీఆర్వోలతోనే భర్తీ చేయాలని నిర్ణయించి, వారికి రాతపరీక్ష నిర్వహించి 3550 మందిని ఎంపిక చేశారు. ఇంకా.. 7,404 జీపీఓ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. రెవిన్యూమంత్రి పొంగులేటి సైతం.. త్వరలోనే జీపీఓలను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామని చాలా సార్లు చెప్పినా.. ఆ దిశగా ఇంతవరకూ ఎలాంటి ముందడుగూ లేదు. కనీసం.. పరీక్ష పద్ధతి, సిలబస్ మొదలైన వాటిపై కూడా ఎలాంటి క్లారిటీ లేకపోవడంతో.. నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు.

## రాహుల్.. రేవంత్ తరపున సారీ చెప్పు

బీహార్ ఎన్నికల్లో అస్త్రం గా రేవంత్ కామెంట్స్

▶ గతంలో బిహారీ అధికారులపై రేవంత్ కామెంట్స్

▶ రేవంత్ పై చర్యలకు ప్రశాంత్ కిశోర్ డిమాండ్

▶ చర్యలు తీసుకున్నాకే రాహుల్ రావాలన్న పీకే




పాట్నా: అప్పుడెప్పుడో బిహార్ అధికారులపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ ను ఇరుకున పెట్టేలా ఉన్నాయి. బిహార్ ప్రజల్ని కించపరిచేలా మాట్లాడిన రేవంత్ పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చర్యలు తీసుకోవాలని జన్ సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిశోర్ డిమాండ్ చేశారు. ఆ తర్వాతే బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి రావాలని డిమాండ్ చేస్తున్నారు.

### రేవంత్ ఏమన్నారు ?

గతంలో కేసీఆర్ తన ప్రభుత్వంలో కొన్ని కీలక హొదాల్లో బిహారీ అధికారులను నియమించుకున్నారు. కేసీఆర్ ను టార్గెట్ చేస్తూ, రేవంత్ రెడ్డి సీఎం కాకముందు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ లేవనెత్తి కాంగ్రెస్ ను ఇరుకునపెట్టారు. తమ పూర్వీకులు బిహార్ నుంచి వచ్చారంటూ కేసీఆర్ 2008లో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ రాష్ట్రానికి చెందినవారికే సీఎస్, డీజీపీ లాంటి కీలక పోస్టులు కేటాయిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. బిహారీల చేతిలో తెలంగాణ బందీగా మారిందని కామెంట్ చేశారు. అయితే శ్రమ చేయడం బీహారీల డీఎన్ఏలోనే ఉంది. బిహారీలు అంతా లేబర్స్.. వాళ్ళు శ్రమ చేయడం కోసమే పుట్టారంటూ రేవంత్ మాట్లాడారని పీకే ఆరోపించారు. ఆయన ఎందుకు అలా అన్నారు? ఈ కామెంట్స్ కి కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. బీహారీ ప్రజలపై యేళ్ళ తరబడి నిర్లక్ష్యం, అగౌరవం ఉంది." అని ప్రశాంత్ కిశోర్ మండిపడ్డారు.

"1989లో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ 50 వేల కోట్ల రూపాయలతో బీహార్‌ను అభివృద్ధి కేంద్రంగా మారుస్తానని చెప్పారు. ఆ డబ్బు ఎక్కడికి పోయింది? ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలో ఉంది. మీరు బీహార్‌కి ఏం చేశారో చెప్పండి?" అని ప్రశ్నించారు. "సిక్కులకు జరిగిన అన్యాయానికి కాంగ్రెస్ క్షమాపణ చెబితే.. రాహుల్ గాంధీ బిహార్‌లో ప్రచారం చేసే ముందు బీహారీలకు కూడా క్షమాపణ చెప్పాలి. బిహారీలు శ్రమ కోసమే పుట్టినట్లయితే, మీరు ఇక్కడికి ఎందుకు వస్తున్నారు? తెలంగాణలో ప్రచారం చేసి అక్కడ మీ ఓట్లు పొందండి. ఇక్కడ కాదు అంటూ మండిపడ్డారు ప్రశాంత్ కిశోర్. ఈ ఇష్యూ ద్వారా బిహార్ లోకల్ సెంటిమెంట్ ను రెచ్చగొడుతున్న పీకే, అదే స్థాయిలో కాంగ్రెస్ కు నెగటివ్ క్యాంపెయిన్ మొదలుపెట్టారు. అసలే బిహార్ లో అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి, పీకే చేతిలో రేవంత్ కామెంట్స్ ఇష్యూ కొత్త అస్త్రంగా మారింది.రాహుల్.. రేవంత్ తరపున సారీ చెప్పు

## సీజ్ ద బంక్..

▶ సీఎం కాన్వాయ్ కే.. నీళ్లు కలిపిన డీజిల్

▶ రోడ్డు మీదే ఆగిపోయిన 19 వాహనాలు ▶ మధ్యప్రదేశ్ సీఎం మోహన్ కు చేదు అనుభవం





కల్తీ పెట్రోల్.. కల్తీ డీజిల్ గురించి మనం చాలా సార్లు వింటుంటాం.. ఒక్కో సారి పెట్రోల్ బంకులు చేసే మోసాలు మనకు అనుభవంలోకి కూడా వచ్చే ఉంటాయి. ఈ సారి ఏకంగా మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ కే షాకిచ్చింది ఓ పెట్రోల్ బంక్.. ఇన్నాళ్లూ.. సామాన్యులకే కల్తీ డీజిల్ అమ్మిన ఆ బంక్ నిర్వాహకులు.. ఏకంగా ముఖ్యమంత్రి కాన్వాయ్ కే కల్తీ డిజిల్ కొట్టేశారు. దాంతో వారి పాపం పండింది. మధ్యప్రదేశ్ లో ఈ ఘటన జరిగింది. మధ్యప్రదేశ్ లోని రత్లాం జిల్లా, దోసీగావ్‌లోని శక్తి ఫ్యూయల్స్ పెట్రోల్ పంప్ ఉంది. అక్కడ భారత్ పెట్రోలియం కంపెనీ డీజిల్ అమ్ముతారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ రత్లాంలో జరిగే %వీూ% రైజ్ 2025 కాన్‌క్లేవ్ లో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం రత్లాంకు వెళ్లారు. ఈ కాన్వాయ్‌లోని 19 ఇన్నోవా వాహనాలు ఇండోర్ నుండి రత్లాం వెళ్తున్న సమయంలో మధ్యలో పెట్రోల్ పంప్ వద్ద డీజిల్ నింపుకున్నాయి. డీజిల్ నింపిన కొద్ది దూరం తర్వాత, కాన్వాయ్‌లోని 19 ఇన్నోవా వాహనాలు ఒక్కొక్కటిగా ఆగిపోయాయి. కొన్ని వాహనాలు పెట్రోల్ పంప్ వద్దనే ఆగిపోగా మరికొన్ని హైవేపై కొంత దూరం వెళ్లిన తర్వాత ఆగిపోయాయి. ఏమయిందా అని డీజిల్ ట్యాంకులను తనిఖీ చేసినప్పుడు, డీజిల్‌లో సుమారు 50 శాతం నీరు కలిసి ఉన్నట్లు గుర్తించారు. 20 లీటర్ల డీజిల్‌లో సుమారు 10 లీటర్లు నీరు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ కలుషిత డీజిల్ వల్ల వాహనాల ఇంజన్లు పనిచేయడం ఆగిపోయాయి. కాన్వాయ్ లోని వాహనాలు ఆగిపోవడంతో, అధికారులు ఇండోర్ నుండి ప్రత్యామ్నాయ వాహనాలను త్వరగా ఏర్పాటు చేశారు. కాన్వాయ్ వాహనాలను డ్రైవర్లు , పెట్రోల్ పంప్ సిబ్బంది లాక్కెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తన కాన్వాయ్ లోని వాహనాలే.. ఆగిపోవడంతో చిర్రెత్తుకొచ్చిన సీఎం.. వెంటనే సీజ్ ద బంక్ అని ఆర్డర్లివ్వడం.. వెంటనే అధికారులు.. రంగంలోకి దిగి బంక్ ను సీజ్ చేయడం జరిగింది.

## జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి ఫిక్స్



### మాగంటి కుటుంబం నుంచే అభ్యర్థి ఫైనల్

### కార్యకర్తలతో మమేకమౌతున్న మాగంటి సునీత

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో.. బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఫైనల్ అయ్యారా..? రేసులో ఎంతో మంది ఉన్నా.. కేసీఆర్ మాత్రం.. మాగంటి కుటుంబం వైపే మొగ్గు చూపుతున్నారా..? బలమైన కమ్మ సామాజిక వర్గం ఓట్లతో పాటు.. సానుభూతి పనిచేయాలంటే.. దివంగత మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీతే పోటీకి సరైన అభ్యర్థి అని గులాబీ బాస్ భావిస్తున్నారా..? జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే అలాగే కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో.. బీఆర్ఎస్ పార్టీ నుంచి దివంగత మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత బరిలో ఉండటం దాదాపు ఖాయమైంది. త్వరలో ఉపఎన్నిక జరగనున్న ఈ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలంటే.. మాగంటి సునీతే సరైన అభ్యర్థి అని బీఆర్ఎస్ అధిష్టానం భావించి.. పోటీలో ఆమెను నిలబెట్టేందుకు ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీనికి తగ్గట్లుగానే.. మాగంటి సునీత.. నియోజకవర్గ పరిధిలో మాగంటి అనుచరులను పరామర్శిస్తున్నారు.తాజాగా బోరబండ డివిజన్ లో కాంగ్రెస్ సర్కార్ వేధింపులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బీఆర్ఎస్ కార్యకర్త సర్దార్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు మాగంటి సునీత ధైర్యం చెప్పారు. సర్దార్ ఇద్దరు పిల్లలకు, కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని సునీత భరోసా ఇచ్చారు. ఆ తర్వాత షేక్ పేట్ డివిజన్ లో.. ముఖ్య నేతలు ఏర్పాటు చేసిన మాగంటి సంస్మరణ కార్యక్రమానికి హాజరై.. నివాళులు అర్పించారు. మాగంటి గోపీనాథ్ అనుచరులకు తాను అండగా ఉంటానని.. హామీ ఇచ్చారు. మాగంటి సునీతతో పాటు.. డివిజన్ లోని అందరు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావడం విశేషం.

యువ తెలంగాణ
epaper.yuvatelangana.net

# విజయమ్మ ఫోన్ ట్యాపింగ్ ?

(యువ తెలంగాణ, హైదరాబాద్): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ అయినవాళ్ళల్లో ఇప్పుడు వైఎస్ సతీమణి విజయమ్మ పేరు కూడా వినిపిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు వెయ్యి మంది ఫోన్లు ట్యాప్ చేసినట్టు తెలుస్తోంది. అందులో జగన్ తల్లి విజయమ్మ ఫోన్ కూడా ఉన్నట్టు సమాచారం. అదే నిజమైతే జగన్ మెడకు మరో ఉచ్చు చిక్కుకోవడం ఖాయమని అంటున్నారు. మొదట తెలంగాణకే పరిమితమైన ఈ ట్యాపింగ్ ఇష్యూ.. ఇప్పుడు ఏపీని కూడా తాకింది. పొలిటికల్ లీడర్లతోపాటు వ్యాపారవేత్తలు, జడ్జీలు, సినీ ప్రముఖులు, మీడియా (యజమానులు, జర్నలిస్టుల), సినీ నటుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. విజయమ్మ ఫోన్ కూడా ట్యాప్ అయినట్టు సిట్ అధికారులు గుర్తించారు. వైఎస్ షర్మిలతోపాటు విజయమ్మ ఫోన్ కూడా ట్యాప్ చేసినట్టు తెలుస్తోంది. అప్పట్లో ఏపీలో వైసీపీ, ఇటు బీఆర్ఎస్ మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేవి. షర్మిల, విజయమ్మ ఎవరితో మాట్లాడుతున్నారు? అనే విషయాలను వైసీపీ కీలక నేత ద్వారా ఏపీ ప్రభుత్వ పెద్దలకు సమాచారం వెళ్లినట్టు సిట్ గుర్తించింది. ఈ క్రమంలో ఏపీకి చెందిన నేతల స్టేట్‌మెంట్లను రికార్డు చేయాలని భావిస్తోందట సిట్. షర్మిల ఫోన్ దాదాపు 45 రోజులు ట్యాప్ చేసినట్టు తెలుస్తోంది. జగన్-షర్మిలకు గ్యాప్ సమయంలో కూతురు వైపు విజయమ్మ మొగ్గు చూపారు.



మొత్తానికి తెలంగాణ ఫోన్ ట్యాపింగ్‌లో జగన్ కూడా ఇరుక్కుపోయినట్టు కనిపిస్తున్నారు.

# మానస సరోవర్ యాత్రకు గ్రీన్ సిగ్నల్

## ▸ ఆరేళ్ల తర్వాత తొలగిన అడ్డంకులు

## ▸ చైనాతో ఫలించిన రాజ్ నాథ్ చర్చలు

ఆరేళ్లుగా మూతబడిన.. కైలాస్ మానస సరోవర యాత్రకు ఎట్టకేలకు మోక్షం లభించింది. చైనాలోని కింగ్‌డావో నగరంలో జరిగిన %ూజూ% (షాంఘై సహకార సంస్థ) రక్షణ మంత్రుల సమావేశంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్‌తో జరిగిన ద్వైపాక్షిక సమావేశాల్లో కొవిడ్ సమయం నుంచి ఆగిపోయిన మానస సరోవర్ యాత్ర గురించి భారత రక్షణ మంత్రి ప్రస్తావించారు. అనంతరం యాత్ర పునఃప్రారంభంపై చైనా సానుకూలంగా స్పందించింది. దాదాపు ఆరు సంవత్సరాల తర్వాత కైలాష్ మానసరోవర్ యాత్ర తిరిగి ప్రారంభమవుతుందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ విషయంలో భారతదేశం-చైనా మధ్య సానుకూల సంభాషణ జరిగిందని %ూజూ% సమానత్వం, సంప్రదింపులు, పరస్పర ప్రయోజనం, ప్రాంతీయ బహుపాక్షిక సహకారం షాంఘై స్ఫూర్తిని కొనసాగిస్తుందని చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్ అన్నారు. ఇది సభ్య దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలపై సహకారాన్ని పెంచడానికి, పరస్పర విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి అవకాశాన్ని ఇచ్చే వేదిక అన్నారు. పరస్పర సహకారాన్ని మరింతగా పెంచడంతో పాటు వ్యూహాత్మక పరస్పర విశ్వాసాన్ని కూడా పెంచుతుందని డాంగ్ జున్ అభిప్రాయపడ్డారు.



# బనకచర్లపై పీపీటీ పేరుతో కాలయాపన: హరీష్



(యువ తెలంగాణ, హైదరాబాద్ ) : బనకచర్లపై పీపీటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. డైవర్షన్ కోసమే ప్రజాప్రతినిధులకు సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారు. 2016 ఎజెండా మినిట్స్ పై రేవంత్ తో చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. బనకచర్లపై జలశక్తి మీటింగ్ లో తెలంగాణ వాదన గట్టిగా విన్పించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. కేంద్రంలో తనకున్న పలుకుబడితో ఎపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో బనకచర్ల కార్పొరేషన్ లేదని, టెండర్లు పిలవలేదన్నారు. తెలంగాణకు నష్టం జరగకముందే బనకచర్లను ఆపేలా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని హరీష్ రావు సూచించారు. బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# నిపుణులు నివేదిక ఇచ్చినా రేవంత్ మొద్దు నిద్ర: కేటీఆర్



**(యువ తెలంగాణ, హైదరాబాద్ ):** మంజీరా బ్యారేజీ విషయం లో నిపుణులు నివేదిక ఇచ్చినా సిఎం రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడట్లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీటిఆర్ విమర్శించారు. మంజీరా ఆఫ్రాన్ కొట్టుకు పోయిందని, స్పిల్ వే దెబ్బతిందని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు చేతకాని తనం వల్లే మంజీరా బ్యారేజీ ప్రమాదంలో పడిందని ఆరోపించారు. మార్చి 22నే నిపుణులు మంజీరా బ్యారేజీని సందర్శించారు. నది దిగువ భాగంలో పిల్లర్లకు పగుళ్లు వచ్చాయని కేటీఆర్ అన్నారు. పిల్లర్లు, ఆఫ్రాన్, స్పిల్ వేపై నిపుణుల బృందం నివేదిక ఇచ్చిందని, మేడిగడ్డ, మంజీరా బ్యారేజీలను వెంటనే రిపేర్ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మంజీరాపై కాంగ్రెస్, బీజేపీ నేతలు స్పందించకపోవడం దారుణమని అన్నారు.

# నల్గొండలో రక్తదాన శిబిరం




నల్లగొండ, సమాజ సేవలో ముందు ఉంటామని, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు అన్నారు. స్థానిక డాక్టర్లు విటల్ బాబు శ్రీవాణి ల విఠల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి లో 10వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో డాక్టర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ నేత్రదానం, రక్తదానం, అవయవ దానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దామర యాదయ్య, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

## బెల్లాల్ చెరువులో పెరిగిన నేటి నిలువలు



బోధన్, నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి తాగు నీరు, సాగు నీరు అందించే బెల్లాల్ చెరువులో నీటి నిల్వలు పెరిగాయి. రెండు రోజులుగా వర్షం కురవడంతో పాటు నిజాం సాగర్ నీటిని విడుదల చేయడంతో బెల్లాల్ చెరువులో నీరు భారీగా వచ్చి చేరింది. బెల్లాల్ చెరువు అలుగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నీటి ప్రవాహన్ని మున్సిపల్ ఏఈ ముఖ్యర్ మోహిద్దీన్, వాటర్ ఫిల్టర్ బెడ్ ఇంచార్జ్ రఫీక్ పరిశీలించారు.

## ప్రభుత్వ బడుల్లో 13,214 మంది చేరిక

నిజామాబాద్ రూరల్, కామారెడ్డి జిల్లాలో చేపట్టిన ‘బడిబాట’ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందని డీఈఓ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 13,214 మంది కొత్త విద్యార్థులు బడిబాటలో చేరారని పేర్కొన్నారు. టీచర్లు, ఇతర సిబ్బంది సమన్వయంతో బడిబాట సక్సెస్ అయిందని, ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధన, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు.

## ఖాళీ బిందెలతో కాలనీ వాసుల నిరసన

ఎల్లారెడ్డి, కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి జీపి పరిధిలోని గురురాఘవేంద్ర కాలనీలో గత 2 నెలలుగా నీరు సరఫరా కావడం లేదని కాలనీవాసులు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నీటి విషయమై పంచాయతీ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యను వెంటనే తీర్చాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

## షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ, కామారెడ్డి జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 1వ తరగతిలో మిగిలిన, 15 సీట్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి వెంకటేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 26వ తేదీ నుంచి జులై 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు కలెక్టరేట్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

## ఎల్లారెడ్డి: బస్టాండ్ లో అందమైన స్టీల్ చైర్స్ దాతగా నిలిచిన డాక్టర్

ఆర్మూర్, ఎల్లారెడ్డిలో 4.5 కోట్లతో నిర్మించిన బస్ స్టాండ్ ను ఇటీవలే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ బస్ స్టాండ్ అందంగా నిర్మించారు. ప్రయాణికుల సౌకర్యార్థం అందమైన కుర్చీలు, టీవీలు అవసరం ఉండగా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ నాగేశ్వర రావు దాదాపు 5 లక్షల వరకు వెచ్చించి స్టీల్ చైర్స్, పెద్ద టీవీలు డొనేట్ చేసారు.



## తడి చెత్త- పొడి చెత్తపై అవగాహన సదస్సు

షాద్‌నగర్, షాద్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తోనే సాధ్యమవుతుందని షాద్ నగర్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నడి కూడ సరిత యాదగిరి యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మార్పు. అభివృద్ధి పేరుతో వందరోజుల కార్యక్రమానికి షాద్ నగర్ మున్సిపాలిటీ శుక్రవారం శ్రీకారం చుట్టింది. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆధ్వర్యంలో తడి చెత్త-పొడి చెత్త (మార్పు అభివృద్ధి) అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



# లా స్టూడెంట్‌పై గ్యాంగ్ రేప్






### ▶ కోల్ కతాలో మరో దారుణం

కోల్ కతాలో ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్ హత్యాచార సంఘటన మరువకముందే మరో దారుణం వెలుగు చూసింది. సౌత్ కోల్ కతాలో ఓ లా స్టూడెంట్ పై గ్యాంగ్ రేప్ జరిగింది. ముగ్గురు వ్యక్తులు కాలేజీ క్యాంపస్ లోనే ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. జూన్ 25న ఈ ఇన్సిడెంట్ జరిగినట్టు తెలుస్తోంది. దీనిపై బాధితురాలి పేరెంట్స్.. పోలీసులకు కంప్లైంట్ ఇచ్చారు. దీంతో, నిందితులను అరెస్ట్ చేశారు. అందులో బాధితురాలు చదువుతున్న కాలేజీకి చెందిన ఇద్దరు స్టూడెంట్స్ తో పాటు ఓ సీనియర్ ఉన్నాడని పోలీసులు తెలిపారు. వారిని మోనోజిత్ మిశ్రా, జైబ్ అహ్మద్, ప్రమిత్ ముఖర్జీగా గుర్తించారు. గురువారం సాయంత్రం ఇద్దరిని, శుక్రవారం ఉదయం మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. విక్టిమ్ కు చిత్తరంజన్ నేషనల్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ లో వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘటనా స్థలం దగ్గర క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

# హాకీ స్టిక్ తో కొట్టి.. వీడియోలు తీసి

### ▶ రేప్ ఇన్సిడెంట్‌లో షాకింగ్ విషయాలు

కోల్ కతాలో లా స్టూడెంట్ పై రేప్ ఇన్సిడెంట్ లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. 24 ఏళ్ల ఆ విద్యార్థినిపై నిందితులు ముగ్గురూ అమానుషంగా ప్రవర్తించారు. తనను వదిలేయాలని ఆమె ఎంత రిక్వెస్ట్ చేసినా వాళ్లు జాలి చూపలేదు. కనికరం లేకుండా దారుణానికి ఒడిగట్టారు. పోలీసులకు ఇచ్చిన కంప్లైంట్ లో బాధితురాలు భయానక విషయాలను వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం… కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మోనోజిత్ మిశ్రా తనను పెళ్లి చేసుకోవాలని.. బాధితురాలిని కొంత కాలంగా వేధిస్తున్నాడు. అతడు తృణమూల్ కాంగ్రెస్ ఛత్ర పరిషత్ సౌత్ కోల్ కతా యూనిట్ జనరల్ సెక్రటరీగా ఉన్నాడు.అయితే, మోనోజిత్ ప్రపోజల్ ను విక్టిమ్ రిజెక్ట్ చేశారు. తనకు బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని చెప్పారు. దీంతో, మోనోజిత్ కోపం పెంచుకున్నాడు. మరో ఇద్దరితో కలిసి ఆమెపై అత్యాచారం చేశాడు. లా కాలేజీలోనే తనను బంధించి ఈ దారుణానికి ఒడిగట్టాడు. బాధితురాలు ప్రతిఘటించడంతో ఆమెను.. వాళ్ళు హాకీ స్టిక్ తో కొట్టారు. కాళ్ల మీద పడి బతిమిలాడినా కూడా వదల్లేదు. రేప్ చేస్తూ వీడియోలు కూడా తీశారు. ఈ విషయం ఎవరికైనా చెప్తే వాటిని బయట పెడతామని.. చంపేస్తామని భయపెట్టారు. ఇవన్నీ బాధితురాలు కంప్లయింట్ లో వెల్లడించారు. తనకు న్యాయం చేయాలని కోరారు.మరోవైపు, నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అలాగే సాక్షుల స్టేట్ మెంట్ ను కూడా తీసుకున్నారు. ఈ ఇన్సిడెంట్ పై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. సంఘటనను సుమోటోగా స్వీకరించింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని పోలీస్ డిపార్ట్ మెంట్ ను ఆదేశించింది.

# హైదరాబాద్ మల్లంపేటలో ఘోరం

### ▶ చిన్నారిని చిదిమేసిన టిప్పర్



కళ్ల ముందే కన్నబిడ్డ చనిపోయాడు. గుండె బద్దలైన విషాదకర ఘటన హైదరాబాద్ లోని మల్లంపేట్ లో జరిగింది. బాలుడు తన తల్లితో కలిసి స్కూటీపై స్కూలుకు వెళ్తుండగా, వేగంగా వస్తున్న టిప్పర్ లారీ వారిని ఢీకొట్టింది. బాలుడు పైనుంచి టిప్పర్ వెళ్లడంతో బాలుడు నుజ్జునుజ్జయ్యాడు. స్పాట్ లో చిన్నారి చనిపోయాడు. తల్లికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘోర ప్రమాదం మల్లంపేట్ వద్దనున్న పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో ఉదయం స్కూల్ సమయంలో జరిగింది. కళ్ల ముందు కొడుకు చనిపోవడంతో ఆ తల్లి విలవిల్లాడింది. ఆమెని ఓదార్చడం ఎవరవల్లా కాలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తల్లిని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి .. టిప్పర్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనతో కాసేపు ఆప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మృతుడు ఆరేళ్ల అభిమన్యురెడ్డిగా గుర్తించారు. బాలుడి సొంతూరు నిజామాబాద్. కుటుంబంతో కలిసి ఈమధ్యనే మల్లంపేటలో నివాసం ఉంటున్నారు. చిన్నారి గీతాంజలి ఇంటర్నేషనల్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడు. స్కూల్ కు వెళ్లే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు




కేసు నమోదు చేశారు. రోడ్డుపైకి వెళ్లేటపుడు జాగ్రత్త అంటూ పదే పదే పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఉదయం, సాయంత్రం సమయంలో హైదరాబాద్ సిటీ పరిధిలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. అయినా వాహనాల జోరు ఏమాత్రం తగ్గకపోగా.. ఎక్కువవుతున్నాయి. ఇలా కుటుంబాల్లో విషాదం నింపుతున్నాయి.

# నా భర్తకు కౌన్సిలింగ్ ఇప్పించండి

### ఎన్నారై నవీన్‌రెడ్డి భార్య ఆవేదన

**ఖమ్మం, జూన్ 27** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఒక ఎన్నారై పెళ్లి వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భర్త నవీన్‌రెడ్డి తనను వేధిస్తున్నాడని.. తిరిగి అమెరికాకు తీసుకెళ్లడం లేదని భార్య దుబ్బాక శ్రావ్య ఆరోపించారు. సంతానం విషయంలో తనపై నిందలు వేసి వైద్య పరీక్షలు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును విచారిస్తున్న ఇల్లెందు సీఐ సత్యనారాయణను నవీన్‌రెడ్డి తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఐజీ సస్పెండ్ చేయడాన్ని శ్రావ్య తప్పుబట్టారు. పోలీసు ఉన్నతాధికారులు నిందితులకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. ఓ ఎన్నారై పెళ్లి వివాదంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సీఐ సత్యనారాయణ సస్పెన్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. ఇల్లెందుకు చెందిన పెండ్లి నవీన్‌రెడ్డికి హైదరాబాద్‌లోని చెంగిచెర్లకు చెందిన దుబ్బాక శ్రావ్యతో 2023 జూన్‌లో వివాహం జరగ్గా.. పెళ్లి తర్వాత కొంతకాలం పాటు అమెరికాలోని డల్లాస్‌లో వీరి కాపురం సాగింది. అమెరికాలో ఉన్న సమయంలో నవీన్‌రెడ్డి, శ్రావ్యకు సమాచారం ఇవ్వకుండానే పలువురు డాక్టర్లతో ప్రెగ్నెన్సీకి సంబంధించిన కొన్ని పరీక్షలు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత శ్రావ్యను హైదరాబాద్‌కు పంపించారు. సుమారు ఏడాది గడిచినా నవీన్‌రెడ్డి శ్రావ్యను తిరిగి అమెరికాకు తీసుకెళ్లలేదు. దీంతో ఆమె ఇల్లందు పోలీసులను ఆశ్రయించగా.. కేసు విచారణ చేపట్టిన సీఐను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. నవీన్ రెడ్డి తల్లిదండ్రుల పద్మజ, ఉపేందర్‌రెడ్డిని నిర్బంధంగా స్టేషన్‌లో ఉంచారన్న కారణంతో సీఐపై చర్యలు తీసుకున్నారు. తాజాగా.. ఈ వివాదంపై ఎన్నారై భార్య, బాధితురాలు శ్రావ్య స్పందించారు. పోలీసు ఉన్నతాధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు పోలీసులు మద్దతుగా నిలుస్తున్నారని మండిపడ్డారు. ఈ కేసులో విచారణ జరుపుతున్న ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణను సస్పెండ్ చేయడాన్ని ఆమె తప్పుబట్టారు. తన భర్త నవీన్‌రెడ్డి వీసా స్టాంపింగ్ పేరుతో ఆమెను భారత్‌కు పంపిన తర్వాత తిరిగి అమెరికాకు తీసుకెళ్లడం లేదన్నారు. సంతానం కలగడం లేదని, తనలో లోపం ఉందని తోటికోడలు, ఆమె భర్త హరీష్‌రెడ్డి తనను ఆస్పత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారని శ్రావ్య ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు తనలో ఎలాంటి లోపం లేదని, భర్తకు పరీక్షలు నిర్వహించాలని సూచించినా.. అత్తింటివారు తనపైనే నిందలు వేస్తూ మానసిక క్షోభకు గురిచేశారని



వాపోయారు. తన కొడుకు ఇండియాకు రాడని, అతనిలో ఏ లోపం లేదని చెబుతూ.. తమకు ఐజీ అండగా ఉన్నారని ఉపేందర్ రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని శ్రావ్య ఆరోపించారు. పోలీసు కౌన్సిలింగ్‌కు కూడా రాకుండా తప్పించుకుంటున్న తన భర్తను అమెరికా నుంచి రప్పించి తనకు న్యాయం చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 20 రోజులుగా న్యాయం కోసం తిరుగుతున్నా తమను పట్టించుకునేవారు లేరని వాపోయారు శ్రావ్య తండ్రి వేణుగోపాల్‌రెడ్డి . నవీన్‌రెడ్డి విషయంలో మాత్రం ఐజీ వెంటనే స్పందించారని ఆరోపించారు. తన కూతురికి న్యాయం జరగాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, డీజీపీని కలుస్తానన్నారు. ఈ కేసులో ఉన్నతాధికారుల జోక్యం, సీఐ సస్పెన్షన్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది

# మోటార్ సైకిళ్ల ముఠాకు చెక్

## 33 బైక్ లు స్వాధీనం





**కరీంనగర్** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో మోటార్ సైకిళ్లను దొంగిలించిన ఆరుగురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుండి మొత్తం 33 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. కరీంనగర్ టూ టౌన్ పరిధిలోని పద్మనగర్‌లో టూ టౌన్ తో పాటు సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం వాహనాలను తనిఖీలు చేశారు. రెండు మోటార్ సైకిళ్ళపై ట్రిపుల్ రైడింగ్ లో వెళ్తున్న ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వీరు కరీంనగర్ కమీషనరేట్ , సిరిసిల్ల జిల్లా పరిధిలో మొత్తం 12,27,000 రూపాయల విలువగల, 33 మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు తేలింది. ఈ దొంగతనాలకు సంబంధించి మొత్తం ఆరు పోలీస్ స్టేషన్లలో 22 కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమీషనర్ తెలిపారు. ఈ అరెస్టులతో మోటార్ సైకిల్ దొంగతనాలకు అడ్డుకట్ట పడిందని, ప్రజలు తమ వాహనాల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమీషనర్ సూచించారు. నిందితుల్ని పట్టుకున్న టౌన్ ఏసీపీ వెంకటస్వామి , టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి , సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కోటేశ్వర్ వన్ టౌన్, జాన్ రెడ్డి త్రీ టౌన్ తో పాటు ఇతర సిబ్బందిని పోలీసు కమీషనర్ రివార్డు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

# కోడలి రేప్.. హత్య..

## గోతిలో శవం







కోడలిపై మామ కన్నేశాడు.. అదనపు కట్నం పేరుతో నిరంతరం వేధించాడు. ఒక రోజు చూసుకొని ఆమెను దారుణంగా రేప్ చేసి చంపేశాడు. ముందే తీసిన పది అడుగుల గోతిలో.. ఆమె శవాన్ని దాచి.. ఏమీ తెలీనట్లు యాక్షన్ చేశాడు. సుమారు రెండు నెలల తర్వాత.. పాపం పండి.. కటకటాలపాలయ్యాడు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ సంఘటన.. హర్యానాలోని ఫరీదాబాద్ లో జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ జిల్లా షికోహాబాద్‌కు చెందిన 24 ఏళ్ల మహిళకు ఫరీదాబాద్‌కు చెందిన వ్యక్తితో 2023 జూలైలో పెళ్లి జరిగింది. కాగా, పెళ్లైన నాటి నుంచి అదనపు కట్నం కోసం అత్తింటి వారు ఆ మహిళను వేధించారు. ఈ నేపథ్యంలో ఆమెను చంపాలని మామ ప్లాన్ వేశాడు. ఏప్రిల్ 21న కోడలి ఆహారంలో.. మత్తుమందు కలిపాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోగా.. మామ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆమెను హత్య చేశాడు. కుమారుడితో కలిసి కోడలి మృతదేహాన్ని ఇంటి బయటకు తెచ్చాడు. డ్రైనేజీ పిట్ కోసమంటూ ముందుగా తవ్వి ఉంచిన పది అడుగుల లోతైన గోతిలో ఆమె మృతదేహాన్ని ఉంచి పూడ్చివేశారు. ఆ తర్వాత దానిపై కాంక్రీట్ స్లాబ్ నిర్మించారు. కాగా, తన కోడలు కనిపించడం లేదని ఏప్రిల్ 25న పోలీసులకు మామ ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే అత్తింటి వారే ఆ మహిళను హత్య చేసి మృతదేహాన్ని గోతిలో పాతిపెట్టినట్లు రెండు నెలల తర్వాత పోలీసులు తెలుసుకున్నారు. జూన్ 21న జేసీబీతో అక్కడ తవ్వించి కుళ్లిన మహిళ మృతదేహాన్ని వెలికితీశారు. మామను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా కోడలిపై అత్యాచారానికి పాల్పడిన తర్వాత హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో మామతోపాటు మహిళ భర్త, అత్త, ఆమె కుమార్తెను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని కస్టడీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనం పేలి

## మహిళ మృతి



**కడప** యర్రగుంట్ల మండల పరిధిలో గల పోట్లదుర్తి గ్రామంలో చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రికల్ స్కూటీ ఒక్కసారిగా పేలడంతో పక్కనే నిద్రిస్తున్న మహిళ మృతి చెందింది. మృతి చెందిన మహిళ వెంకటలక్ష్మమ్మ (62) గా గుర్తించారు. స్కూటీ ఒక్కసారిగా బ్లాస్ట్ అవ్వడంతో పక్కనే సోఫాలో నిద్రిస్తున్న వెంకటలక్ష్మమ్మ మంటల్లో కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# 15 రోజుల్లో.. ఇంటికే ఓటరు కార్డు

## - జూబ్లీహిల్స్, ఖైరతాబాద్‌లో క్యాంపెయిన్




(యువ తెలంగాణ, హైదరాబాద్ ) : కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్లను ప్రోత్సహించడానికి, ఓటింగ్ శాతాన్ని పెంచడానికి సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు, ఓటరు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసిన వాళ్లకు కేవలం 15 రోజుల్లోనే ఓటరు కార్డు ఇంటికి చేరిపోతుంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, ఈ కొత్త సంస్కరణతో ఎన్నికల సంఘం ముందుకొస్తోంది. ఇప్పటివరకు ఓటరు కార్డు తీసుకోవడానికి నెల రోజులకు పైగా టైమ్ పట్టేది. కానీ, ఇప్పుడు లేటెస్ట్ టెక్నాలజీని ఉపయోగించి, కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను ఈజీ చేసింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో జీహెచ్ఎంసీ అధికారులు ఈ కొత్త విధానం గురించి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. అర్హులైన వాళ్లంతా ఓటరు కార్డు తీసుకునేలా చైతన్యం తెస్తున్నారు. ఇకపై ఓటరు కార్డు జారీలో ఎలాంటి ఆలస్యం ఉండదు, అన్నీ సక్రమంగా, వేగంగా జరుగుతాయి. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్నవాళ్లతో పాటు, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు చేసుకున్నవాళ్లకు కూడా 15 రోజుల్లోనే కార్డు అందుతుంది. ఈ ప్రక్రియలో పారదర్శకత కోసం, ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) ఓటరు కార్డు తయారు చేసినప్పటి నుంచి, అది పోస్టల్ ద్వారా ఇంటికి చేరే వరకు, ఓటరుకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుంది.

### ఎలా అప్లయ్ చేయాలి ?

ఓటరు కార్డు కోసం అప్లయ్ చేయడం చాలా ఈజీ. ముందు, %జుజ×.+ూ.×చీ% వెబ్‌సైట్‌కి వెళ్లాలి. అక్కడ మీ ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీతో సైన్ అప్ చేయాలి. ఆ తర్వాత, మీ పేరు, పాస్‌వర్డ్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా లాగిన్ అవ్వాలి. కొత్తగా నమోదు చేసుకునేవాళ్లు ఫారం-6లో వ్యక్తిగత వివరాలు, అడ్రస్, లాంటి విషయాలు నమోదు చేసి, డాక్యుమెంట్లు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. మార్పుల కోసం ఫారం-8, పేరు తొలగించడానికి ఫారం-7 ఉపయోగించాలి. దరఖాస్తు స్టేటస్ తెలుసుకోవడానికి ట్రాక్ అప్లికేషన్ స్టేటస్ ఆప్షన్‌లో రిఫరెన్స్ నెంబర్‌తో చెక్ చేసుకోవచ్చు. ఈ కొత్త విధానంతో, ఓటర్లు సులభంగా, వేగంగా తమ ఓటు హక్కును పొందే అవకాశం ఉంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం కోరుతోంది!

# అన్నం కూడా పెట్టరా..?

## సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఫైర్



కాంగ్రెస్ ప్రభుత్వం.. పేద విద్యార్థులకు సరైన అన్నం కూడా పెట్టకుండా.. వాళ్లు ఉసురు పోసుకుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్.. కేటీఆర్ నిప్పులు చెరిగారు. తెలంగాణాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల కాలేజీలు, విశ్వ విద్యాలయాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు భోజనం పెట్టకుండా వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని.. ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'అన్నపు రాశులు ఒకచోట, ఆకలి మంటలు ఒకచోట .. హంస తూలికలు ఒకచోట, అలసిన దేహాలు ఒకచోట' అని కవి కాళోజీ నారాయణ రావు చెప్పినట్లు తెలంగాణలో పరిస్థితి నెలకొని ఉందన్నారు. అందాల పోటీల్లో విందులకు ప్లేటు భోజనం రూ.లక్ష, వేములవాడలో కాంగ్రెస్ సభకు ఆలయ ఆదాయంతో ప్లేటు భోజనం రూ.36 వేలు, ఒక్కో పట్టుపంచెకు రూ.10 వేలు ఖర్చు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు కనీసం పట్టెడన్నం కూడా పెట్టడం లేదు అని కేటీఆర్ మండిపడ్డారు. ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు అంటూ వందల కోట్లు దండుకునేందుకు టెండర్ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉన్న గురుకులాలు, విశ్వవిద్యాలయాలలో భోజనం పెట్టకుండా గోస పెడుతున్నది అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. భావి తెలంగాణ భవిష్యత్తును ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బలిపెడుతున్నదని కేటీఆర్ మండిపడ్డారు. నాడు దేశానికి దిక్సూచిలా నిలిచిన తెలంగాణ విద్యావ్యవస్థ.. నేడు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా మారి విద్యార్థులను అవస్థలు పెడుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. జాగో విద్యార్థి జాగో.. జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ నినదించారు.

# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి: వెంకటరెడ్డి

చేవెళ్ల, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని శుక్రవారం చేవెళ్ల %ూాజూ% చైర్మన్ దేవర వెంకటరెడ్డి అన్నారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందువల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో ఇళ్ల ముందు వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. వర్షపు నీరు నిలువ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

# 'స్మశానవాటికల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



సికింద్రాబాద్ కంటోన్మెంట్, న్యూ బోయినపల్లిలోని మౌంట్ కార్మేల్ పాఠశాల ఎదురుగా ఉన్న హిందూ స్మశానవాటికలో షెడ్డు నిర్మాణ పనులు, చిన్నతోకట్టలోని జి.ఎం. అంజయ్య స్మారక స్మశానవాటికలో గదుల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొని మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి చివరి మజిలి శాంతియుతంగా సాగేందుకు స్మశానవాటికల్లో మౌలిక వసతులు అవసరమని, దాతలు

# రామచంద్రపురంలో పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ట భూమి పూజ



మహబూబ్‌నగర్, మహబూబ్ నగర్ రూరల్ మండలం రామచంద్రాపూర్ గ్రామంలో శుక్రవారం ప్రజా వీరుడు పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠ భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బాలగోపి, రజక సంఘం అధ్యక్షులు శివన్న, గ్రామ పెద్దలు పద్మ నారాయణ, బోయిని రాములు, వరద తిరుపతయ్య, దేశం మహేష్ గౌడ్, వెంకటయ్య, వరద దశరథ, పెద్ద వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ, పీజీలో అడ్మిషన్లకు ఆహ్వానం

జడ్చర్ల, జడ్చర్ల మండలం మాచారం టీజీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో (మెన్) దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం ప్రిన్సిపల్ డా. కే. భవాని తెలిపారు. సీబీసీఎస్ విధానంలో బీఎస్సీ (ఎంపీసీ, ఎంపీసీఎస్, బిజెడ్సీ, ఎంజెడ్సీ బిజెడ్సీఎస్) బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ(హెచ్ఈపి), పీజీలో ఐఎంఎస్సీ కెమిస్ట్రీ ఖాళీలు ఉన్నాయన్నారు. ఎస్టీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

# మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించాలి

కొల్లాపూర్, కొల్లాపూర్ పట్టణంలో టిడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నేత రామచంద్రం మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం నిరాహార దీక్ష చేస్తుంటే కొల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# రూ.5 అన్నపూర్ణ కేంద్రాలు ఇక ఇందిర క్యాంటీన్లు

## ▸ భోజనంతో పాటు టిఫిన్ కూడా



(యువ తెలంగాణ, హైదరాబాద్) గ్రేటర్ హైదరాబాద్ లో రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాలకు ఇందిర క్యాంటీన్లుగా పేరు పెట్టాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అలాగే ఈ కేంద్రాల్లో భోజనంతో పాటు టిఫిన్ కూడా అందించాలని భావిస్తున్నారు. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మీటింగ్ లో తీర్మానం చేశారు. ఎజెండాలోని 22 అంశాలతోపాటు టేబుల్ ఐటమ్స్‌గా 10 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. క్యాంటిన్లలో 11 చోట్ల సీటింగ్ సదుపాయం కల్పించడంతో పాటు, మరో 40 చోట్ల జనం కూర్చుని తినేలా సౌకర్యాలు కల్పిస్తారు. ఈ సమావేశంలో కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, సభ్యులు పాల్గొన్నారు.

# అల్లాపూర్ శివారులో పేకాట శిబిరంపై దాడి

మెదక్, మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో పేకాట శిబిరంపై రాత్రి దాడి చేసినట్లు తూప్రాన్ సీఐ రంగ కృష్ణ తెలిపారు. అల్లాపూర్ శివారులోని అశోక్ జైన్ వెంచర్ లో పేకాట ఆడుతున్నట్టు నమ్మదగిన సమాచారం రాగా దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని 5 ఫోన్లు, మూడు బైకులు, రూ. 10, 700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ యాదగిరి, సిబ్బంది పాల్గొనట్లు వివరించారు.

# బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా మంత్రి పొన్నం కు ఆహ్వానం

హుస్నాబాద్, శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు రావాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఆహ్వానం అందించారు. శుక్రవారం హైద్రాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ని దేవాదాయ శాఖ అధికారులు మరియు ఆలయ కమిటీ అధికారులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రసాదం అందజేశారు.

# గ్రామాల్లో డ్రైడేను మరిచిన అధికారులు..

## - అనారోగ్యంతో ప్రజలు

గజ్వేల్, మిరుదొడ్డి మండలంలో ఎక్కడ చూసినా మురికి కాలువలు ఎక్కడికక్కడే నిండిపోయాయి. ప్రజలు అనారోగ్య బారిన పడుతున్న మురికి కాలువలను తొలగించని స్థితి నెలకొన్నది. మిరుదొడ్డి మండల కేంద్రంతో పాటు లింగుపల్లి, చెప్యాల, అలవాల మల్లుపల్లి, లక్ష్మీ నగర్, కొండాపూర్, తో పాటు పలు గ్రామాల్లో మురికి కాలువలు నీరు నిలువ ఉండడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు తెలిపితే మాకు నిధులు వచ్చాక చేస్తామని ఆరోపణ చేస్తున్నారు.

# కేంద్ర బాలసాహిత్య పురస్కారం 2025 శివకుమార్‌కు అభినందనలు



సిద్దిపేట కేంద్ర బాల సాహిత్య పురస్కారం 2025 తెలుగు విభాగంలో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త గంగిశెట్టి శివకుమార్ రచించిన "కబుర్ల దేవత బాలల కథా" సంపుటికి లభించడం పట్ల సిద్దిపేట బాలసాహితీవేత్తలు ఎన్నవెళ్ళి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం, బస్వ రాజ్ కుమార్ లు అభినందనలు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ శివకుమార్ కు అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

SUBSCRIBE YT CHANNEL
TELUGU JOURNALIST
యువ తెలంగాణలో వచ్చే న్యూస్ ఆర్టికల్స్
అనాలసిస్ ని సీనియర్ జర్నలిస్ట్
మేడుకొండూరు విష్ణుకుమార్
వీడియోల రూపంలో
Telugu Journalist YouTube Channel లో అందిస్తున్నారు.
ఆ ఛానెల్ లింక్ కోసం QR క్లిక్ చేయండి.
Subscribe చేసుకోండి.

# రూ. 500 కోట్లతో ట్రస్ట్

▶ ఫ్లైట్ యాక్సిడెంట్ బాధితుల కోసం.. ▶ టాటా సన్స్ నిర్ణయం








అహ్మదాబాద్ లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం జరిగి 270 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. దీంతో, టాటా సన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబాలకు ఫైనాన్షియల్ సపోర్ట్ అందించేందుకుగానూ ట్రస్ట్ ను ఏర్పాటు చేయాలని డిసైడైంది. ఇందుకుగానూ బోర్డు పర్మిషన్ కోరినట్లు సమాచారం. ఈ ట్రస్ట్ కు రూ. 500 కోట్లు కేటాయించనున్నారు. దీనికి అనుమతి ఇవ్వాలని టాటా సన్స్ కోరినట్టు తెలుస్తోంది. జూన్ 12న ఫ్లైట్ క్రాష్ తర్వాత.. తొలిసారిగా జరిగిన బోర్డు మీటింగ్ లో ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. విమాన ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు.. ట్రస్ట్ కు కేటాయించే ఫండ్స్ తో ఆర్థిక సాయం చేస్తారు. గాయపడిన వారి ట్రీట్ మెంట్ కు అయ్యే ఖర్చులనూ భరిస్తారు. అలాగే, ఫ్లైట్ క్రాష్ కారణంగా దెబ్బతిన్న మెడికల్ కాలేజీని పునరుద్ధరించడంతో పాటు ఇతర పనులకు ఈ నిధులను వాడతారు. మిగిలిన మొత్తాన్ని ఆ ఫ్యామిలీస్ కు ఫ్యూచర్ లో ఉపయోగపడేలా చూస్తారు. త్వరలోనే ఈ ట్రస్ట్ ను రిజిస్టర్ చేసే అవకాశాలున్నాయి. అలాగే, ఇండియాతో పాటు ఇతర దేశాల్లో ఉన్న బాధిత కుటుంబాలకు నేరుగా సాయాన్ని అందించే ప్రాసెస్ ను మొదలుపెడతారు. ఈ కార్యక్రమానికి టాటా మోటార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ పీబీ బాలాజీ నేతృత్వం వహిస్తారని తెలుస్తోంది.

# ముగ్గురు పిల్లల్ని కనండి

▶ ఎలాన్ మస్క్ అడ్వైజ్



టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్.. ఏదో ఒక కామెంట్ చేసి తరచూ వార్తల్లో నిలుస్తారన్న సంగతి తెలిసిందే. లేటెస్ట్ గా మరోసారి ఆయన అలాగే మాట్లాడారు. పిల్లల్ని కనగలిగేవాళ్లు కనీసం ముగ్గురికి బర్త్ ఇవ్వాలని కోరారు. సోషల్ మీడియాలు దీనికి సంబంధించి పోస్ట్ పెట్టారు. అమెరికాలో బర్త్ రేట్ తగ్గడంపై మస్క్ కొద్దిరోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇదివరకే ఆయన చాలా సార్లు స్పందించారు. మళ్లీ రెస్పాండ్ అయి.. ఇలాంటి వ్యాఖ్యలు చేశారు.తగ్గుతున్న జనాభా సమస్యకు పరిష్కారం చూపేందుకు మహిళలు ముగ్గురు పిల్లలకు జన్మనివ్వాలని ఫోర్బ్స్ ప్రచురించిన నివేదికను మస్క్ ప్రస్తావించారు. అమెరికా, నేపాల్, ఇటలీలో బర్త్ రేట్ తక్కువగా ఉందని ఈ రిపోర్ట్ ద్వారా తెలిసింది. దీన్ని గుర్తు చేస్తూ మస్క్.. అమెరికన్లకు అడ్వైజ్ ఇచ్చారు. జననాలు తగ్గితే అమెరికా నాగరికతకు ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కంటిన్యూ అయితే.. తాను చెప్పిన మాటలు మరో 20 ఏళ్లలో నిజమవుతాయని చెప్పారు.

# ఛాట్ జీపీటీని నమ్మకండి

▶ శామ్ ఆల్ట్ మన్ షాకింగ్ కామెంట్స్






ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ ఛాట్ బాట్ ఛాట్ జీపీటీ.. ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూస్తున్నాం కదా. మనం ఏం అడిగినా కూడా చాలా ఫాస్ట్ గా ఆన్సర్ ఇస్తూ.. ఎంతో పాపులర్ అయింది. ఛాట్ జీపీటీని అమెరికాకు చెందిన ఓపెన్ ఏఐ డెవలప్ చేసింది. అది ఎదురులేకుండా దూసుకుపోతోంది. ఇలాంటి టైమ్ లో.. ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్ మన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. జనం.. ఛాట్ జీపీటీని మరీ ఎక్కువగా ట్రస్ట్ చేస్తున్నారని.. గుడ్డిగా నమ్మేస్తున్నారని అన్నారు. ఆ సంస్థ నిర్వహించిన ఫస్ట్ పాడ్ కాస్ట్ లో పాల్గొన్న ఆయన.. పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలాంటి మాయమైన చేస్తుందని ఆల్ట్ మన్ చెప్పారు. "ఛాట్ జీపీటీపై పబ్లిక్ అతి విశ్వాసం చూపిస్తున్నారు. ఇది ఆసక్తికర విషయమే. కానీ దీన్ని అంత ఎక్కువగా ట్రస్ట్ చేయొద్దు. ఒక్కో సారి ఏఐ ఛాట్ బాట్స్ యూజర్ల అవసరాన్ని తీర్చేందుకు ఫేక్ సమాచారాన్ని క్రియేట్ చేసే ఛాన్స్ ఉంది. అసలు ఉనికిలో లేని తప్పుడు ఇన్ఫర్మేషన్ ను కూడా ఇస్తుంటాయి" అని అన్నారు. అందువల్ల వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆల్ట్ మన్ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు టెక్ ఇండస్ట్రీని షేక్ చేస్తున్నాయి. ఏఐ ఛాట్ బాట్స్ పని తీరుపై చాలా డౌట్స్ రేకెత్తిస్తున్నాయి.

# భారత్‌లో వరల్డ్ పోలీస్, ఫైర్ గేమ్స్

▶ గుజరాత్ లో పోటీల నిర్వహణ



మరో ప్రెస్టీజియస్ ఈవెంట్ ను ఇండియా హోస్ట్ చేయనుంది. 2029లో జరిగే వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ ను గ్రాండ్ గా నిర్వహించనుంది. గుజరాత్ లోని అహ్మదాబాద్ వేదికగా ఈ పోటీలు జరుగనున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ విషయాన్ని వెల్లడించారు. మన దేశానికి ఇలాంటి ఛాన్స్ దక్కడం భారతీయులందరికీ గర్వకారణమని

WORLD POLICE FIRE GAMES


చెప్పారు. దీనిపై సంతోషం వ్యక్తం చేశారు.వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ నిర్వహణకు భారత్ ప్రతిష్టాత్మక బిడ్‌ను గెలుచుకుందని అమిత్ షా చెప్పారు. "సర్కారు అందుబాటులోకి తెచ్చిన క్రీడా మౌలిక సదుపాయాలకు వరల్డ్ వైడ్ గా గుర్తింపు లభించింది. 1985 నుంచి ప్రతీ రెండేళ్లకోసారి ఈ గేమ్స్ ను నిర్వహిస్తున్నారు.

ఇప్పటిదాకా 20 సార్లు ఇవి జరిగాయి. ఇందులో 8 సార్లు అమెరికా.. ఐదుసార్లు కెనెడా.. 4 సార్లు యూరప్ వీటిని కండక్ట్ చేశాయి. రెండుసార్లు బ్రిటన్, ఒకసారి చైనా దేశాల్లో ఈ గేమ్స్ జరిగాయి" అని వివరించారు. 2007లో అడిలైడ్ లో జరిగిన క్రీడల్లో మన దేశం తొలిసారిగా పార్టిసిపేట్ చేసింది. 2023లో భారత పోలీస్ సిబ్బంది 224 బంగారు, 82 వెండి, 37 కాంస్య పథకాలు గెల్చుకున్నారు. ఇప్పటి వరకు మొత్తంగా దాదాపు 1,400 మెడల్స్ సాధించి సత్తా చాటారు.

# వరద గుప్పిట్లో హిమాచల్ ప్రదేశ్

▶ ఐదుగురి మృతి ▶ 250 మందిని కాపాడిన ఎస్డీఆర్ఎఫ్






హిమాచల్ ప్రదేశ్ ను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. కులు, కాంగ్రాతో పాటు ఇతర జిల్లాలను అతలాకుతలం చేశాయి. ఫ్లడ్స్ లో చిక్కుకుని ఐదుగురు చనిపోయారు. మరికొందరు గల్లంతయ్యారు. వారికోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ధర్మశాలలోని కొన్ని ఏరియాలను కూడా వరదలు వదల్లేదు. దీంతో, అక్కడున్న 250 మందికిపైగా ప్రజలను సేఫ్ ప్లేస్ కు తరలించారు. ఎస్డీఆర్ఎఫ్, లోకల్ పోలీసులు, హిమాచల్ ప్రదేశ్ హోమ్ గార్డ్ వాలంటీర్లు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ లో పాల్గొంటున్నారు. వరదల్లో చిక్కుకుని చనిపోయిన వారిలో గురువారం రెండు డెడ్ బాడీస్ దొరికాయి. శుక్రవారం మరో మూడింటిని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు.

### క్లౌడ్ బరస్టే కారణం:

హిమాచల్ ప్రదేశ్ లో ఆకస్మిక వరదలు క్లౌడ్ బరస్ట్ కారణమైంది. దీనివల్ల కులూ, షిమ్లా, మండి తదితర జిల్లాల్లో కుంభవృష్టి కురిసింది. సడెన్ రెయిన్స్, ఫ్లడ్స్ తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. ప్రజల డైలీ లైఫ్ ను స్తంభింపజేశాయి. సైంజ్ వ్యాలీలోని సియుండ్ ప్రాంతంలో క్లౌడ్ బరస్ట్ వల్ల.. ప్రైవేట్ పవర్ ప్రాజెక్ట్ తాత్కాలిక షెడ్‌లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వెహికిల్స్ నాశనం అయ్యాయి. ఈ సంఘటనలో ఇద్దరు చనిపోయాగా, 20 మంది గల్లంతయ్యారు.

రోడ్లు డ్యామేజీ కావడం, వరదల్లో వాహనాలు కొట్టుకుపోవడం.. ఇలాంటివన్నీ జరిగాయి. ఇద్దరు రాష్ట్ర మంత్రులు కూడా ట్రాఫిక్ లో చిక్కుకున్నారు. ఫ్లడ్స్ కారణంగా ఆ స్టేట్ లో పరిస్థితి భయానకంగా మారింది. ప్రజలను కాపాడేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# సమంత, రకుల్‌కి నోటీసులిస్తారా?



(యువ తెలంగాణ, హైదరాబాద్ ): ఏడాదిగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ఫైనల్ స్టేజ్ కి వచ్చిందని చెబుతున్నారు. ఇప్పటికే ఫోన్లు ట్యాపింగ్ అయిన పొలిటికల్ లీడర్లను పిలిచి, స్టేట్ మెంట్స్ తీసుకుంది ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్న సిట్. అయితే లేటెస్ట్ గా కొత్తగా కొందరు హీరోయిన్లు, యాంకర్ల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. గతంలో మాత్రమే సమంత, రకుల్ ప్రీత్ సింగ్ ఫోన్లు మాత్రమే ట్యాప్ అయినట్టు తేలింది. సమంత-నాగచైతన్య పెళ్ళి బంధం దెబ్బతినడానికి ఫోన్ ట్యాపింగే కారణమనే ప్రచారం అప్పట్లో నడిచింది. అప్పుడే రకుల్ ప్రీత్ సింగ్ పేరు వినిపించింది. కానీ లేటెస్ట్ గా అనసూయ, ఈషా రెబ్బా, హెబ్బా పటేల్ పేర్లు బయటకు వచ్చాయి. ఓ బీజేపీ ఎమ్మెల్యే హెబ్బా పటేల్ పేరును బయటపెట్టారు. ఆమె ఫోన్ ట్యాప్ అయిందనే సమాచారం తన దగ్గర ఉందన్నారు. ఈ కేసుపై ఇప్పటికే పొలిటికల్ లీడర్లు, మీడియా ఎండీలు, సీఈఓలు, జర్నలిస్టులు, అధికారులు, వ్యాపారవేత్తల స్టేట్ మెంట్స్ తీసుకున్న సిట్ అధికారులు, ఈ హీరోయిన్లను కూడా ఎంక్వయిరీకి పిలుస్తారా? అనే చర్చ నడుస్తోంది. వాళ్ళకి కూడా నోటీసులిచ్చే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. కానీ వీళ్లెవ్వరూ తమ ఫోన్లు ట్యాప్ అయినట్టు పబ్లిక్ గా స్టేట్ మెంట్ ఇవ్వలేదు. అందువల్ల అటు సిట్ అధికారులు కూడా స్పష్టమైన ఆధారాలు దొరికితేనే వీళ్ళకి నోటీసులు ఇచ్చే ఛాన్సుంది. కానీ సిట్ అధికారులకు ఏ చిన్న లీడ్ దొరికినా హీరోయిన్ల స్టేట్ మెంట్స్ రికార్డు చేసే అవకాశముందని చెబుతున్నారు.



# బుడ్డోడు అదరగొట్టాడు..



## వైభవ్ మెరుపు బ్యాటింగ్ తో.. ఇంగ్లండ్ చిత్తు

ఐపీఎల్ చిచ్చర పిడుగు.. వైభవ్ సూర్యవంశీ..ఇంగ్లండ్ టూర్ లోనూ చెలరేగిపోతున్నాడు. ఇంగ్లండ్ అండర్ -19 జట్టుపై విధ్వంసక ఆటతో చెలరేగిన వైభవ్ భారత జట్టు అద్భుత విజయంలో కీలక పాత్ర పోషించాడు. శుక్రవారం జరిగిన తొలి యూత్ వన్డే మ్యాచ్‌లో ఆయుశ్ మాత్రే సారథ్యంలో యంగ్ ఇండియా ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టుకు షాకిచ్చింది. మొదట ప్రత్యర్థిని స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ చేసిన టీమిండియా.. ఆరు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. నాలుగు వన్డేల సిరీస్ లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇంగ్లండ్ పర్యటనలో భారత అండర్ -19 జట్టు అదిరే బోణీ కొట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్‌కు భారత బౌలర్లు ముచ్చెమటలు పట్టించారు. స్పిన్ ద్వయం కనిష్క్ చౌహాన్(3-20), మహమ్మద్ ఇనాన్(2-37)లు తిప్పేయగా.. పేసర్లు అంబ్రిష్(2-24), హెనిల్ పటేల్(2-41)లు వికెట్ల వేట కొనసాగించారు. రాకీ ఫ్లింటాఫ్ అర్ధ శతకంతో రాణించగా ఇంగ్లండ్ 42.2 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటయ్యింది.అనంతరం బ్యాటింగ్‌లో ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ(48: 19 బంతులు) తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే(21)తో ఇన్నింగ్స్ ఆరంభించిన అతడు తొలి వికెట్‌కు ఏడు ఓవర్లలోనే 70 రన్స్ రాబట్టాడు. మాత్రే ఔటయ్యాక వైస్ కెప్టెన్ అభిజ్ఞాన్ కుందు 45 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. 24 ఓవర్లలోనే మ్యాచ్ ముగించిన భారత జట్టు సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది.

# ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ బిల్లు

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పెట్టాలి

## సోషలిస్ట్ కూటమి జాతీయ కార్యదర్శి,, యల్, జైబాబు డిమాండ్

**హైదరాబాద్** ప్రైవేట్ రంగలో రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పెట్టాలని సోషలిస్ట్ కూటమి జాతీయ కార్యదర్శి యల్, జైబాబు డిమాండ్ చేసారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన తెలంగాణ కూటమి రాష్ట్ర కమిటీ సమావేశంలో జైబాబు మాట్లాడుతూ జులై 21నుండి జరుగు వర్షాకాలసమావేశాల్లో బిల్లు తక్షణమే పెట్టాలని, అనేక దశాబ్దాలుగా వివిధ పార్టీల ఎంపి లు ప్రై వేట్ రిజర్వేషన్ బిల్లు పై పట్టు పట్టినా తిరస్కరణకు గురైందన్నారు బిఇ, బిబి, నీఎఇ, వఎఇ, లు ఎన్నో సంవత్సరాలనుండి సామాజిక, ఆర్థిక రంగాల్లో అవకాశల్లో సమాన ప్రాధాన్యం కోసం న్యాయం కోసం పార్లమెంట్ లోపల బైటా పౌర సమాజపక్షంగా పెద్దఎత్తున ఉద్యమం సోషలిస్ట్ పార్టీలు, కమ్యూనిస్ట్ లు ప్రజాసంఘాలనేతలు దేశావ్యాప్తంగా పోరాడుతున్న సంగతి దేశ ప్రధాని మోడీ ద్రుష్టి కి మరోసారి తెస్తూ , కాంగ్రెస్, తో సహా ప్రాంతీయ పార్టీలు ఈ న్యాయమైన డిమాండకోసం, కొన్ని రాష్ట్రాలు జర్ఖండ్,, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, కర్ణాటక 371ఆర్టికల్ తో ఉన్న అవకాశలతో చట్టాలు చేసిన సంగతి ప్రధాని గుర్తించాలన్నారు, హర్యానారాష్ట్రం ప్రై వేట్ రిజర్వేషన్ కల్పన చట్టం పై హైకోర్టు నిలుపుదలచేసిన దేశావ్యాప్తంగా అన్ని రాష్ట్రాల యూవత స్థానిక కోట భూమి పుత్రులుగా మూడింటా రెండు వంతులమంది కేంద్ర ప్రభుత్వమే ప్రైవేట్ రంగాన్ని బ్యాలెన్స్ చేసి చట్టం తీసుకు రావాలని స్వేచ్ఛ సమానత్వాలకు, రాజ్యంగ ఉల్లంగణలు లేకుండా చట్టం చేయాలని సోషలిస్ట్ కూటమి డిమాండ్ చేస్తుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రై వేట్ రంగమే కీలకమన్నారు, చైనాను మించి భారత్ జనాభా పెరుగుతున్నా 94%ప్రజలు అనార్గ నైజడ్ సెక్టర్ లో పనిచేస్తున్నారని ఇక్కడ కార్మికులు శ్రమ దోపిడీకి, యాజమాన్య దోపిడీకి గురై తీరని అన్యాయం జరుగుతుందని ప్రెయివేట్ సంస్థలను అందులో కార్మికులను గుర్తించే చర్యపై ముందుగా పార్లమెంట్ లో చర్చ పెట్టాలని కోరారు. ప్రభుత్వం వద్ద ప్రభుత్వ, ప్రెయివేట్ లో కార్మికులు 10,720,000కోట్లలో ఉన్నా చట్టం వస్తే 18కోట్ల మంది దేశ 'యువత ఒక్కసారిగా లబ్ది పొందుతారని అందులో మొతంగా పెద్దఎతున్న బిఇ బిబి, నీనీఎఇ, వఎఇ లే లబ్ది చేకూరుతుంది అన్నారు, అధిక శ్రమ




ఉత్పత్తి ఉన్నా కార్మికులకు సరైన వేతనాలు పిఎఫ్ గ్రాడ్యూటీ నూతన పెన్షన్ అందటం లేదన్నారు తెలంగాణ భూమి పుత్రులకు స్థానిక చదువు కున్న యువతకు విద్యా, ఉపాధి, ఆర్థిక రంగాల్లో సామాజిక న్యాయం జరగాలంటే పార్లమెంట్ నుండి రావాల్సిన చట్టం పై అన్ని పార్టీల ఎంపి లకు సిఎం రేవంత్ రెడ్డి దిశ దశ నిర్దేశం చేసి వర్షాకాలపార్లమెంట్ సమావేశాల్లో దగ్గరుండి ఎంపిలతో పట్టు పట్టి చర్చకు తెరలేపాలని ప్రైవేట్ రిజర్వేషన్ చట్టమ్ తెచ్చి తెలంగాణ ఆస్థిత్వాన్ని కాపడాలన్నారు,చట్ట బద్దత ఉన్న అన్నిరంగాలకు రిజవేషన్ వర్తించే చర్యలు రావాలి, డిలిమిటేషన్ కు నీఎఇ, వఎఇ,, జనాభాలెక్కలు తెల్చాలి రిజర్వేషన్ ల పై పరిమితి ఎత్తి వేసి లకు రిజవషన్లు పెనీచాలని, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు తెలంగాణ పౌర సమాజ పక్షంగా సోషలస్ట్ కూటమి పోరులో బాగమవ్వాలని జైబాబు ఇలుపునిచ్చారు.

ఈ సమావేశం లో డా..సింగం శ్రీనివాస్. తెలంగాణ ఇంచార్జ్,డి.రాణి.తెలంగాణ మహిళా, కార్యదర్శి, ఎన్. రాజు.ట్రేడ్ యూనియనిస్ట్ తె లంగాణ రాష్ట్ర కార్యదర్శ , జాతీయ అద్వయిజర్ దేవసేన, ఎంసీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.చంద్ర శేకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్ల వద్దంటూ ఏపీలో పోరాటం



(యువతెలంగాణ, హైదరాబాద్) : బనకచర్ల ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ లోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. దానివల్ల ఏపీకి నష్టమే తప్ప లాభం లేదంటున్నారు. అంతే కాదు తనలాగే రిటైర్డ్ అయిన వాళ్లతో ఓ సంఘాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. బనకచర్లపై జనంలో చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీస్ ఆఫీసర్ గా గత ఐదేళ్ళపాటు జగన్ హయాంలో ఎన్నో ఇబ్బందులు పడ్డారు ఈ మాజీ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు. రాజకీయాల్లోకి వస్తానని కూడా చెబుతున్నారు. కొత్తపార్టీ పెడతారో లేదో తెలీదు గానీ, ఏపీకి గేమ్ ఛేంజర్ అని చంద్రబాబు చెబుతున్న బనకచర్ల ప్రాజెక్టును ఆయన వ్యతిరేకిస్తున్నారు. ఆ ప్రాజెక్టు అత్యంత ఖర్చుతో కూడుకున్నది. రిటర్న్లు తక్కువగా ఉంటాయని ఏబీవీ వాదిస్తున్నారు. ఒక్కో ఎకరానికి యాభై వేల ఖర్చు వస్తుందనీ, దాని వల్ల ఉపయోగం లేదని అంటున్నారు. అలాగే దానికి స్టోరేజీ కెపాసిటీ కూడా లేదని వివరిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే, కృష్ణా జలాల్లో రెండు వందల టీఎంసీల వాటాను కోల్పోవాల్సి వస్తుందని ఏబీపీ అంటున్నారు.

అంతే కాదు బనకచర్లను జగన్ సమర్థించడంపై ఏబీవీ మరో కారణం చెబుతున్నారు. ఈ ప్రాజెక్టును మేఘాకు అప్పగించాలని గతంలో జగన్ ప్రయత్నించారు. ఇప్పుడు కూడా మేఘాకే ప్రాజెక్టు వస్తుంది. అందుకే జగన్ వ్యతిరేకించడం లేదని ఏబీపీ లాజిక్ మాట్లాడుతున్నారు. గతంలో పట్టిసీమ ప్రాజెక్టుపై జగన్ ఎంత రచ్చ చేశారో చూశాం కదా అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఏబీవీ చెబుతున్నదాంట్లో నిజం ఎంత ఉందో కానీ.. బనకచర్ల ప్రాజెక్టును వ్యతిరేకించడం ఏపీలో హాట్ టాపిక్ గా మారింది.

# హుస్నాబాద్లో పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన అనంతరం

బాలుర పాఠశాలలో బహిరంగ సభ

హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన అనంతరం బాలుర పాఠశాలలో బహిరంగ సభ జరిగింది.






ముఖ్య అతిధులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ హజరయ్యారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ హేమావతి, లైబ్రరీ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు ,వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. చిరకాలంగా ఉన్న హుస్నాబాద్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగింది రెండు సంవత్సరాల కింద ఇదే వేదిక మీద బడి పండగ జరిగింది. అప్పుడు ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలో లేదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, కేబినెట్ మంత్రుల సహకారంతో శాతవాహన యూనివర్సిటీ లో ఇంజనీరింగ్ కాలేజి తరగతులు ఈ సంవత్సరం నుండి ప్రారంభం అవుతున్నాయి. 82.00 కోట్ల రూపాయలతో 150 పడకల ఆరోగ్య కేంద్రాన్ని శంకు స్థాపన చేసుకోవడం జరిగింది. 77.20 కోట్ల రూపాయలతో రాజీవ్ రహదారి కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు రెండు వరుసల రహదారుల నుండి నాలుగు వరుసల రహదారి కి ఫేజ్ 2 కు శంకుస్థాపన చేసుకున్నాం. నూతనంగా 11.50 కోట్ల రూపాయలు తో నూతనంగా నిర్మించిన 50 పడకల మాత శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించుకున్నాం. ఫేజ్ 1 త్వరలోనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్న గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల పనులు జరుగుతున్నాయి. నన్ను గెలిపించండి హుస్నాబాద్ గౌరవాన్ని పెంచుతున్న అభివృద్ధి అన్ని రంగాల్లో ముందుంచుతా ఇక్కడికి వచ్చిన మంత్రులు హుస్నాబాద్ అభివృద్ధికి అభయం ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం లో పంట పెట్టుబడి సహాయం, ఇందిరమ్మ ఇళ్లు, సన్న వడ్లకు 500 బోనస్, రుణమాఫీ, ఆర్టీసీ లో మహిళలకు ఉచిత ప్రయాణం ఇలా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం. అక్కన్నపేట నుండి జనగాం వరకు నాలుగు లైన్ ల రోడ్డు త్వరలోనే వస్తుంది బండి సంజయ్ గారికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఎల్లమ్మ చెరువు అభివృద్ధి ఇంజినీరింగ్ కాలేజీ టూరిజ్ ప్రాజెక్ట్ లు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. హుస్నాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంది.ం

# పెద్దపల్లి జిల్లాలో ఆర్ఓబి మరమ్మత్తు పనులతో నిలిచిపోయిన పలు రైళ్ళు

## ఇక్కట్ల పాలైన ప్రయాణికులు

**పెద్దపల్లి** పెద్దపల్లిలోని కునారం రైల్వే బ్రిడ్జి పనుల మరమ్మత్తులతో బల్లార్షా, కాజీపేట రైల్వే జంక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దపల్లి శివారులో నిర్మాణం చేపడుతున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఉపయోగించే ఇనుప గార్డర్లు క్రాక్ ఇచ్చి బిడ్జి కొంత భాగం కిందికి వంగిపోయింది. రైల్వే పనులు నిర్వహిస్తున్న సిబ్బంది రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు గంటపాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేసి బ్రిడ్జి నిర్మాణ పనులకు అనుమతి ఇచ్చారు. కుంగిపోయిన భాగం ఎంతకు పైకి లేవకపోవడంతో గంటల తరబడి రైల్వే ట్రాక్ పై ట్రైన్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పెద్దపల్లి సమీపంలోని రాఘవపూర్, కొలనూరు, ఓదెల, జమ్మికుంట మ, ఉప్పల్ రైల్వే స్టేషన్లలో పలు రైళ్ళు నిలిచిపోయాయి. భాగ్యనగర్, ఇంటర్సిటీ, సంపర్ క్రాంతి తదితర ట్రైన్లు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి రైళ్లలో అవస్థలు పడుతున్నారు. రైల్వే ట్రాక్ లకు సమీపంలో రోడ్డు మార్గం ఉన్న చోట్ల ప్రయాణికులు ట్రైన్ వదిలేసి నడుస్తూ వచ్చి బస్సుల కోసం రోడ్లపై ఎదురుచూశారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు తక్షణమే మరమ్మత్తులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ట్రాన్స్‌ఫర్ల తర్వాతే ఎస్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలి

### ▶ సీనియర్ హెడ్‌మాస్టర్ల డిమాండ్

రాష్ట్రంలోని విద్యాశాఖలో టీచర్లకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతులు ఇవ్వాలన్న నిర్ణయంపై సీనియర్ హెడ్‌మాస్టర్లు అభ్యంతరం చెబుతున్నారు. ముందు తమ ట్రాన్స్‌ఫర్లు పూర్తి చేసిన తర్వాతే స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. 2023 సెప్టెంబర్‌లో గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతి పొందిన వాళ్లు, సొంత ఊళ్లకు 500 కిలోమీటర్ల దూరంలో, మారుమూల ప్రాంతాల్లో, రవాణా సౌకర్యం లేని స్కూళ్లల్లో పనిచేస్తున్నారు. ఇప్పటికి రెండేళ్లు పూర్తవుతున్నాయి, కానీ సీనియర్ హెడ్ మాస్టర్లను ట్రాన్స్‌ఫర్ చేయకుండా, తమకంటే జూనియర్లు అయినా స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇస్తే, తమకు అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. బదిలీలు లేకుండా పదోన్నతులు ఇస్తే, కొందరు టీచర్లు తమకు అనుకూలమైన పోస్టింగ్‌ల కోసం పైరవీలు, లాబీయింగ్‌లు చేసే అవకాశం ఉంది. దాంతో అర్హులైన వాళ్లకు అన్యాయం జరుగుతుంది. ఒకసారి ట్రాన్స్‌ఫర్లు పూర్తయితే, ఖాళీల వివరాలు కూడా స్పష్టంగా తెలుస్తాయని సీనియర్ హెడ్‌మాస్టర్లు చెబుతున్నారు. అప్పుడు అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని వివరిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకొని, సీనియర్ల అభ్యంతరాలను లెక్కలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

2023 సెప్టెంబర్‌లో 994 మంది గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టులకు ప్రమోషన్లు ఇచ్చారు. ఇవి మల్టీ-జోన్ పోస్టులు కావడంతో, కొందరు ఖమ్మం, హనుమకొండ, వరంగల్, కరీంనగర్ లాంటి ప్రాంతాలకు దగ్గరగా బదిలీ అయ్యారు. కానీ, ఖాళీలు ఎక్కువగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ లాంటి దూరప్రాంతాల్లో మిగిలాయి. దీంతో అర్హత ఉన్న టీచర్లు ఎక్కువగా ఉండటం వల్ల, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నుంచి వచ్చిన వాళ్లకు దూరప్రాంతాలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. చాలామంది ఎన్నో ఏళ్లుగా ప్రమోషన్ కోసం ఎదురుచూస్తూ, సొంత జిల్లాలకు 100 నుంచి 500 కిలోమీటర్ల దూరంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక, 2023 సెప్టెంబర్ తర్వాత, రిటైర్మెంట్స్ వల్ల ప్రతి జిల్లాలో 30 నుంచి 50 ఖాళీలు ఏర్పడ్డాయని అంటున్నారు.

ఈ ఖాళీలను మల్టీ-జోన్ పోస్టులుగా మార్చి, ముందు సీనియర్ హెడ్‌మాస్టర్లకు ట్రాన్స్‌ఫర్లు ఇచ్చి, ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వాలని సీనియర్ హెచ్‌ఎంలు కోరుతున్నారు. వయసు, ఆరోగ్య సమస్యలు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా, పట్టించుకోవట్లేదని వాపోతున్నారు. ఒకవేళ ట్రాన్స్‌ఫర్లు జరపకుండా ఎస్‌ఏలకు పదోన్నతులు ఇస్తే, సీనియర్ హెడ్‌మాస్టర్లు సుదూర ప్రాంతాల్లోనే రిటైర్ కావాల్సి వస్తుందనీ, అది తమకు తీవ్ర అన్యాయమని అంటున్నారు. అందరికీ న్యాయం జరిగేలా, పారదర్శకంగా ఈ ప్రక్రియ జరగాలనేది వాళ్ల డిమాండ్.

# తమిళనాడులో పవర్ స్టార్ సునామీ

### ▶ తమిళ రాజకీయాల్లో కొత్త తుఫాన్ ▶ 2026 ఎన్నికల్లో పవన్ కీ రోల్



తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఓ వెలుగు వెలిగిన పవర్ స్టార్ పవన్ కల్యాణ్, ఇప్పుడు రాజకీయాల్లోనూ సంచలనం సృష్టిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడిగా బిజీగా ఉన్నారు. అటు తమిళనాడు రాజకీయాల్లో కూడా పవన్ పేరు మార్మోగుతోంది. ఈమధ్య మధురైలో జరిగిన మురుగన్ భక్తార్గళ్ మానాడు సక్సెస్ తర్వాత, డీఎంకే లాంటి తమిళనాడు ప్రాంతీయ పార్టీలు ఒక్కసారిగా అలర్ట్ అయిపోయాయి. మధురైలో జరిగిన మురుగన్ భక్తార్గళ్ మానాడులో పవన్ కల్యాణ్ స్పీచ్ ఆకట్టుకుంది. "మురుగన్ నామస్మరణతో ఏ శత్రువైనా పారిపోతాడు. ధర్మ మార్గంలో నడిచి, సనాతన ధర్మాన్ని గౌరవించడంలో తప్పు లేదు. హిందువు తన మతాన్ని గౌరవిస్తే ఎందుకు అభ్యంతరం?" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, తమిళనాడులో డీఎంకే నేతలకు ఒక్కసారిగా షాక్ ఇచ్చాయి. ఈ సభలో పవన్ తమిళంలోనూ అనర్గళంగా మాట్లాడారు... లక్షలాది మురుగన్ భక్తులను ఆకట్టుకున్నారు పవన్. ఈ స్పీచ్ తమిళనాడు రాజకీయ వర్గాల్లో ఓ రేంజ్‌లో డిబేట్ స్టార్ట్ చేసింది.

### డీఎంకే అలర్ట్ ?

తమిళనాడులో డీఎంకే అనేది ద్రవిడ భావజాలంపై రాజకీయాలు చేసే పార్టీ. సనాతన ధర్మం గురించి గతంలో ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. అలాంటి సమయంలో, పవన్ కల్యాణ్ సనాతన ధర్మాన్ని సమర్థిస్తూ, హిందూ భావజాలాన్ని బలంగా ప్రజల ముందుకు తీసుకొచ్చారు. ఇది డీఎంకేకి పెద్ద ఛాలెంజ్‌గా మారింది. ఎందుకంటే, తమిళనాడులో హిందూ ఓటర్లు ఎక్కువ. కానీ డీఎంకే మాత్రం.... ద్రవిడ ఐడియాలజీని ఫాలో అవుతూ, హిందూ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని బీజేపీ, ఇతర పార్టీలు విమర్శిస్తున్నాయి. తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు, "పవన్ కల్యాణ్‌కి తమిళనాడుతో ఏం సంబంధం? ఆయన ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తారా?" అంటూ సవాల్ విసిరారు. అంతేకాదు, పవన్ చెన్నైలో పెరిగినా, ఆయన తెలుగువాడని, ఇక్కడ రాజకీయాలు చేయడం కష్టమని కూడా అన్నారు. ఇది చూస్తే, డీఎంకేకి పవన్ ఎంట్రీ ఓ థ్రెట్‌గా కనిపిస్తోందని అర్థమవుతోంది.

### సత్యరాజ్, ప్రకాశ్ రాజ్ విమర్శలు

తమిళ సినిమా ఇండస్ట్రీ నుంచి కూడా పవన్‌పై విమర్శలు వచ్చాయి. నటుడు సత్యరాజ్, "మేం పెరియార్ మనుషులం, మమ్మల్ని మోసం చేయలేరు" అంటూ పవన్‌పై ఫైర్ అయ్యారు. అలాగే, ప్రకాశ్ రాజ్ గతంలో సనాతన ధర్మం గురించి పవన్ చేసిన కామెంట్స్‌పై కౌంటర్ ఇచ్చారు. ఇదంతా చూస్తే, పవన్ సనాతన ధర్మం గురించి మాట్లాడినప్పుడు, ద్రవిడ భావజాలాన్ని ఫాలో అయ్యే వాళ్లకు ఇది రుచించడం లేదని అర్థమవుతోంది.



### 2026 తమిళనాడు ఎన్నికల్లో పవన్ రోల్

2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఇందులో బీజేపీ, ఎన్డీయే కూటమి బలంగా పోటీ చేయడానికి ప్లాన్ చేస్తోంది. పవన్ కల్యాణ్, జనసేన పార్టీ అధ్యక్షుడిగా, బీజేపీతో పొత్తు కొనసాగిస్తున్నారు. 2020లోనే ఆయన బీజేపీతో అలయన్స్ ప్రకటించారు, ఇప్పుడు తమిళనాడులో కూడా బీజేపీ ప్రచారంలో పవన్ కీలక రోల్ పోషించే అవకాశం ఉంది. తమిళనాడు బీజేపీ నేత ANS ప్రసాద్, "పవన్ చెన్నైలో పెరిగారు, తమిళంలో మాట్లాడగలరు. ఆయన సనాతన ధర్మం గురించి చెప్పిన మాటలు లక్షల హిందువులను ఆకట్టుకున్నాయి అంటున్నారు... ఇది చూస్తే, పవన్ తమిళనాడులో హిందూ ఓటర్లను బీజేపీ వైపు ఆకర్షించే ఐకాన్‌గా మారే ఛాన్స్ ఉంది. పవన్ కల్యాణ్ కి తమిళనాడులోనూ ఫ్యాన్ బేస్ ఉంది. పవన్ కల్యాణ్‌కి తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, తమిళనాడులోనూ ఫ్యాన్ ఫాలోయింగ్ బాగా ఉంది. ఆయన సినిమాలు, స్టైల్, మాటలు యూత్‌ని బాగా ఆకట్టుకుంటాయి.

ఇది రాజకీయంగా కూడా ఓట్లుగా మారే ఛాన్స్ ఉంది. సనాతన ధర్మం ఎజెండా: పవన్ సనాతన ధర్మాన్ని బలంగా సమర్థిస్తూ, హిందూ ఓటర్లను ఏకం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇది డీఎంకే లాంటి పార్టీలకు భయం పుట్టిస్తోంది. ఎందుకంటే హిందూ ఓట్లు బీజేపీ వైపు మళ్లే అవకాశం ఉంది. బీజేపీతో పొత్తు: పవన్ జనసేన పార్టీ బీజేపీతో కలిసి పనిచేస్తోంది. 2026 ఎన్నికల్లో బీజేపీ తమిళనాడులో బలపడితే, డీఎంకే, ఇతర ద్రవిడ పార్టీలకు ఇది పెద్ద దెబ్బే. చెన్నైలో పెరిగిన పవన్, తమిళంలో మాట్లాడగలడు, లోకల్ కల్చర్‌ని అర్థం చేసుకోగలడు. ఇది ఆయన్ని తమిళ ఓటర్లకు దగ్గర చేస్తోంది.

### ఛాలెంజెస్ ఉన్నాయ్!

తమిళనాడులో ద్రవిడ భావజాలం చాలా బలంగా ఉంది. పెరియార్ ఫాలోయర్స్, డీఎంకే లాంటి పార్టీలు హిందూ భావజాలాన్ని ఎదుర్కొనేందుకు ఎప్పుడూ రెడీగా ఉంటాయి. పవన్ లాంటి బయటి లీడర్ ఇక్కడ రాజకీయంగా సక్సెస్ అవ్వాలంటే, లోకల్ సెంటిమెంట్స్‌ని బ్యాలెన్స్ చేయాలి. అంతేకాదు, సత్యరాజ్ లాంటి స్టార్స్, డీఎంకే నేతలు పవన్‌ని టార్గెట్ చేస్తూ వస్తున్నారు. ఇవన్నీ ఆయనకు ఛాలెంజెస్‌గా మారొచ్చు. పవన్ కల్యాణ్ తమిళనాడు రాజకీయాల్లో సనాతన ధర్మానికి ఓ ఐకాన్‌గా మారే ఛాన్స్ ఉంది. కానీ అది అంత సులభం కూడా కాదు. ఆయన చరిష్మా, ఫ్యాన్ ఫాలోయింగ్, బీజేపీతో పొత్తు ఒక ఎత్తయితే, డీఎంకే, ద్రవిడ భావజాలం ఓ బలమైన గోడలాగా నిలబడతాయి. అయితే 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ ఎలాంటి రోల్ పోషిస్తారు, బీజేపీకి ఎంత సపోర్ట్ చేస్తారనేది చూడాలి. ఒకవేళ ఆయన సనాతన ధర్మం ఎజెండాతో హిందూ ఓటర్లను ఏకం చేస్తే,

తమిళనాడు రాజకీయాల్లో ఓ కొత్త అధ్యాయం రాసే ఛాన్స్ ఉంది!

## రాజకీయ దురంధరుడు

# పాములపర్తి

సమకాలీన రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకొని తదనుగుణంగా సానుకూల వాతావరణం ఏర్పరచుకుని పరిపాలన సాగించిన వాడే సమర్ధుడైన నాయకుడు కాగలడు అనేది అర్థశాస్త్ర రచయిత అయిన కౌటిల్యుడిగా పేరున్న చాణక్యుని అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొని, తదనుగుణంగా నడుచుకొని బలం, బలగం లేకున్నా, దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేయ గలిగారు పి.వి. నరసింహారావు. దక్షిణ భారతావని నుండి ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగువానిగా, నరసింహారావు కార్యదీక్షత, దార్శనికత ద్వారా ఖ్యాతి గడించారు. "పి.వి"గా లబ్ద ప్రతిష్టులైన ఆయన బహు భాషావేత్త, రచయిత. స్నాతకోత్తర న్యాయశాస్త్ర కోవిదులు, "అపర చాణక్యుడిగా" పేరొందారు. ఆంధ్ర ప్రదేశ్ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పి.వి జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలు పెట్టారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండీ పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు.1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ "వందేమాతరం" గేయాన్ని పాడారు. తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు. దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూరు విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుని ఇంట్లోనే ఉంటూ, 1940 నుండి 1944 వరకు ఎల్.ఎల్.బి చదివారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమం లోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నారు. 1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పివి, రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా కేంద్ర మంత్రిగా, చివరకు ప్రధానిగా తన మేధాశక్తితో, క్రమానుగతంగా ఉన్నత పదవులను, కైవసం చేసుకున్న రాజనీతిజ్ఞులు ఆయన. కాంగ్రెస్ హయాంలో, పూర్తి సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని, తన చాకచక్యంతో చాణక్యనీతితో, పూర్తి కాలం నడిపించిన మేధావి. 1957 లో మంథని నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా నాలుగు సార్లు గెలిచారు. 1962 లో మొదటిసారి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది, 62 నుండి 64 వరకు న్యాయ సమాచార మంత్రిగా, 64 నుండి 67 వరకు దేవాదాయ, న్యాయబీ 67 లో వైద్య ఆరోగ్య 68 నుండి 71 వరకు న్యాయ, సమాచార శాఖలను నిర్వహించారు. 77లో లోకసభకు ఎన్నికైనారు. జనవరి 1980 - జూలై 1984 కేంద్ర విదేశ వ్యవహారాల మంత్రిబీ జూలై 1984 - డిసెంబర్ 1984 కంద్ర హెూం శాఖమంత్రిబీ నవంబరు 1984 - ఫిబ్రవరి 1985 భారత ప్రణాళికా శాఖ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, జనవరి 1985 - సెప్టెంబరు 1985 కేంద్ర రక్షణ శాఖమంత్రి, సెప్టెంబరు 1985 - జూన్, 1988 కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిబీ జూలై 1986 - ఫిబ్రవరి 1988 కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖమంత్రిబీ జూన్ 1988 - డిసెంబర్ 1989 విదేశ వ్యవహారాల శాఖ మంత్రిబీ 1991 మే 29 - 1996 కాంగ్రెసు పార్టీ అధ్యక్షునిగాబీ జూన్ 1991 %-% 1996 మే 10 వరకు ప్రధానమంత్రిగా పని చేశారు. 71 సెప్టెంబర్ నుండి 73 జనవరి వరకు ముఖ్యమంత్రిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. సీఎం పీఠం అధిష్టించగానే అసమ్మతి. ఈ విషయమై అధిష్టానంతో చర్చించేందుకు ఢిల్లీ - హైదరాబాదుల మధ్య తిరిగేందుకే ఆయనకు సమయం సరిపోయింది. పట్టణ భూ గరిష్ట చట్టాన్ని తెచ్చింది ఆయనే. ఆ తర్వాత ఆయన కార్యక్షేత్రం ఢిల్లీకి మారింది. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా, మొదటిసారి హనుమకొండ నుండి లోకసభకు ఎన్నికైనారు. నంద్యాల ద్వారా ఉప ఎన్నికలలో, టిడిపి పోటీ లేకుండా ఐదు లక్షల పైచిలుకు మెజారిటీతో గెలుపొంది, గిన్నిస్ రికార్డు సృష్టించి, పదవ లోకసభలో అడుగిడి, పలు శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. రాజీవ్ హత్య కారణంగా 1991 లో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయకుండానే, దేశ 10వ ప్రధాన మంత్రి పదవి చేపట్టారు. భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి కుంటుతున్న వ్యవస్థను, తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకుని, "భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా" పేరొందిన మేధావి. ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం కోసం చేపట్టిన సంస్కరణలు, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక శాస్త్రవేత్త గా ఉన్న మన్మోహన్ సింగ్ ను, ప్రత్యేకించి పిలిచి, దేశ ఆర్థిక మంత్రిని చేయడం ఆయనకే చెల్లింది. దేశాన్ని బంగారం తాకట్టు పెట్టాల్సిన స్థితి నుండి, సూపర్ పవర్ గా తేర్చి దిద్దడానికి పునాది వేశారు. ఆర్థిక సంస్కరణల ద్వారా మార్కెట్ సరళీకరణ ఆర్థిక విధానాన్ని రూపొందించారు. సంస్కరణల 1992 లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కంప్యూటర్ ఆధారిత వ్యాపార పద్ధతిని ప్రారంభించారు. పంజాబ్ తీవ్రవాదాన్ని అణచి వేసింది ఆయన ప్రభుత్వమే. కాశ్మీర్ తీవ్రవాదులు ప్రముఖులను అపహరించినప్పుడు, వారి డిమాండ్లను లెక్క పెట్టక బందీలను విడిపించిన ఘనత ఆయనదే. ఇజ్రాయెల్ తో దౌత్య సంబంధాలు, తీవ్రవాదానికి పాకిస్థాన్ ఇస్తున్న ప్రోత్సాహాన్ని బయటపెట్టి, ఆగ్నేయాసియా దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండడం, పివి ప్రభుత్వం సాధించిన విజయమే.1998లో వాజపేయి ప్రభుత్వం జరిపిన అణుపరీక్షల కార్యక్రమాన్ని మొదలు పెట్టింది పీవీ ప్రభుత్వమే. ఆయన కాలంలోనే బాంబు తయారయింది. ఈ విషయాన్ని స్వయంగా వాజపేయే ప్రకటించారు. రాష్ట్ర విద్యా మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థ, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాలకు రూపకర్త అయినారు. 1973లో సీఎంగా భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూ గరిష్ట పరిమితి, పట్టణ పరిమితి చట్టాన్ని అమలు చేసిందీ పి.వి.నే. ప్రధానిగా ఆయన హయాంలో 1992 డిసెంబర్ 6 న అయోధ్యలో బాబరీ మసీదును కూలగొట్టిన సంఘటనలో పీవి వైఖరి వివాదాస్పదమైంది.

ప్రధానిగా ఐదేళ్ళ పదవీకాలంలో అనేక అవినీతి ఆరోపణలను పివి ఎదుర్కొన్నారు. చివరి కేసులన్నీ వీగిపోయాయి. బహుభాషా పండితులు, 17 భాషలలో అలవోకగా మాట్లాడ గలిగిన మేధావి. 1940 లో తన సోదరులతో కలిసి కాకతీయ పత్రికలో ఎన్నో వ్యాసాలు రాశారు. 1948 నుండి 51 వరకు కాకతీయ పత్రిక "సంపాదకునిగా" పని చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత వేయి పడగలను, "సహస్ర ఫణ్" పేరుతో, హిందీ అనువాదం చేసి జ్ఞానపీఠ అవార్డు పొందారు. 1968-74 మధ్య తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ గా ఉన్నారు. ఆయన రచనల్లో ప్రఖ్యాతి చెందినది "ఇన్‌సైడర్" అనే ఆత్మకథ. లోపలి మనిషిగా ఇది తెలుగులోకి అనువాద మయింది.

1983 లో స్పానిష్ భాషలో ప్రసంగించి, అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో, క్యూబా అధ్యక్షులు ఫిడేల్ ను అబ్బుర పరిచిన గొప్పతనం ఆయనది. నిరాడంబరుడు, తన పిల్లలను సైతం ప్రధాని కార్యాలయానికి దూరంగా ఉంచిన నిజాయతీ పరులు. చివరిదశలో కోర్టుల చుట్టూ తిరగడానికి సొంత ఆస్తులను అమ్ముకున్న వ్యక్తి. నిజాం వ్యతిరేక పోరాట యుద్ధ తంత్ర నిపుణునిగా చివరకు స్వతంత్ర్య సముపార్జన దినం నాడు, 1947 ఆగస్టు 15 న కూడా అటవీ క్షేత్రంలో పోరాట క్రమంలోనే ఉన్న పోరాట యోధుడు. 2004 డిసెంబర్ 23 న తుది శ్వాస వదిలా రాయన. పి.వి. స్మృత్యర్థం హైదరాబాదులో భారత దేశంలోనే అతిపెద్ద ఫ్లై ఓవర్ కు పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే అని పేరుపెట్టారు.

శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించి,19.10.2009 న ప్రారంభించారు. పివికి భారత రత్న అవార్డు ఇవ్వాలని సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. శత జయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించి, సీనియర్ నేత కేశవరావు అధ్యక్షతన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అనురించడం ద్వారా కేసీఆర్, తెలుగు జాతి మహెూన్నత వ్యక్తికి తగిన గౌరవం ఇవ్వడం ముదావహం.

# ‘మైసా’గా రష్మిక మందన..

## ఫస్ట్ లుక్‌తోనే షాక్ ఇచ్చిన నేషనల్ క్రష్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న న్యూ ప్రాజెక్ట్ పేరు రివీలైంది. ఈ సినిమా పేరుని ‘మైసా’ గా ప్రకటించారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను డైరెక్టర్ రాఘవపూడి రిలీజ్ చేశారు. మిగతా భాషల్లో ధనుష్, శివరాజ్ కుమార్, దుల్కర్ సల్మాన్, విక్కీ కౌశల్ లాంటి ప్రముఖులు ఈ ఈ సినిమా పోస్టర్లను రిలీజ్ చేసి మూవీ యూనిట్ కు ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్లో రష్మిక భయంకరమైన వారియర్ గెటప్ లో కనిపించింది. ఇంతకముందెప్పుడూ చూడని అవతారంలో కనిపించారు. ముక్కు పుడక, మెడలో కంఠహారం ధరించి, ఒక వారియర్ గెటప్ లో చాలా ఇంటెన్స్ గా చూస్తున్నారు. మొహం మీద రక్తపు మరకలు, చేతిలో ఆయుధం చూస్తుంటే ఇందులో ఆమె పాత్ర వైలెంట్ గా ఉండబోతోందని తెలుస్తోంది. ‘అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమాకు రవీంద్ర పుల్లే డైరెక్టర్. ఈ ‘మైసా’ పాన్ ఇండియా మూవీ స్థాయిలో రిలీజ్ కాబోతంది. తెలుగుతో పాటుగా హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. వరుస సక్సెస్ లతో దూసుకెళ్తున్న రష్మిక మందన గత కొన్నేళ్లుగా ఫుల్ ఫామ్ లో ఉన్నారు. బ్యాక్ టూ బ్యాక్ బ్లాక్ బస్టర్లను తన అకౌంట్లో వేసుకుంటున్నారు. ఒక్క ‘సికిందర్’ తప్ప ఈమధ్య కాలంలో ఆమె నటించిన ప్రతీ సినిమా కూడా బ్లాక్ బ్లస్టరే. లేటెస్టుగా ‘కుబేర’ తో మరో సూపర్ సక్సెస్ అందుకున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు తనలోని మరో కోణాన్ని పరిచయం చేయడానికి రెడీ అయింది. ఇందులో భాగంగా ‘మైసా’ అనే ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేసారు.






## అలా చేస్తారనుకోలేదు

### ‘కన్నప్ప’ పై మంచు మనోజ్ షాకింగ్ రివ్యూ

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ ‘కన్నప్ప’ వరల్డ్ వైడ్ గా రిలీజై సాలిడ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘కన్నప్ప’ అందరి మెప్పు పొందుతోంది. ఈ సినిమాని మంచు విష్ణు ఎంతో శ్రమించి నిర్మించారు. ఫస్ట్ షో నుంచే ఈ మూవీకి పాజిటివ్ టాక్ రావడంతో మేకర్స్ ఖుషీ అవుతున్నారు. ఫస్టాఫ్ యావరేజ్‌గా ఉన్నా.. సెకండాఫ్ అదిరిపోయిందని, ప్రభాస్ ఎంట్రీ తర్వాత మూవీ నెక్స్ట్ లెవల్‌లో ఉందని ప్రేక్షకులు చెబుతున్నారు. ఆడియన్స్ నుంచి వస్తోన్న ఫీడ్‌బ్యాక్ చూసి మంచు విష్ణు ఎమోషనల్ అవుతున్నారు. ‘తిన్నడు’గా మంచు విష్ణు కెరీర్లోనే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చారని, ‘రుద్ర’గా ప్రభాస్ అదరగొట్టేశాడని, ‘మహదేవశాస్త్రి’గా మోహన్‌బాబు అద్భుతంగా నటించారని, ఇక శరత్‌బాబు, మోహన్‌లాల్ క్యారెక్టర్లు కూడా అదిరిపోయాయని ఆడియన్స్ అంటున్నారు. ముఖ్యంగా ప్రభాస్ ఈ చిత్రాన్ని ఒంటిచేత్తో నిలబెట్టాడని, క్లైమాక్స్‌లో విష్ణు నటన అదిరిపోయిందని అంటున్నారు. అన్ని వర్గాల నుంచి వస్తోన్న పాజిటివ్ టాక్‌లో మంచు విష్ణు తెగ సంబరపడిపోతున్నారు. ఈ క్రమంలోనే మరో ఊహించని వ్యక్తి నుంచి అదిరపోయే రివ్యూ వచ్చింది. మంచు మనోజ్ ఈ సినిమాని చూసి రివ్యూ ఇవ్వడం టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా మారింది. మనోజ్ ‘కన్నప్ప’ సినిమాని శుక్రవారం ప్రసాద్ ఐమ్యాక్స్ థియేటర్‌లో చూశారు. ఆయన ఎలాంటి రివ్యూ ఇస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుశారు. అయితే ‘కన్నప్ప’పై అంచనాలు పెంచే ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. ‘కన్నప్ప సినిమా చాలా అద్భుతంగా ఉంది. ముఖ్యంగా ప్రభాస్ వచ్చిన తర్వాత నెక్స్ట్ లెవల్‌కి వెళ్లింది. క్లైమాక్స్ చాలా బాగుంది. ఇంత గొప్ప పర్ఫార్మెన్స్ ఇస్తారని కలలో కూడా అనుకోలేదు. సినిమాలో అందరూ బాగా నటించారు. నేను అనుకున్న దానికంటే వెయ్యి రెట్లు అద్భుతంగా సినిమా ఉంది. ‘కన్నప్ప’ పెద్ద విజయం సాధించాలని, వాళ్లు పెట్టిన డబ్బులకు వెయ్యింతలు లాభం రావాలని కోరుకుంటున్నా. థియేటర్‌కి ఐదు నిమిషాలు ఆలస్యంగా రావడంతో కొన్ని సీన్లు మిస్ అయ్యా. రేపు మళ్లీ వచ్చి సినిమా చూస్తా’ అన్నారు మంచు మనోజ్. అన్న విష్ణు పేరు మాత్రం ఎక్కడా చెప్పలేదు. సినిమా రిలీజ్ కి ముందు కూడా విష్ణు పేరు ఎక్కడ మెన్షన్ చేయకుండా విషెష్ చెప్పారు. గత కొన్నిరోజులు మంచు ఫ్యామిలీకి , మనోజ్ కి విభేదాలు వచ్చిన సంగతి తెలిసిందే. రిలీజ్ ముందు మనోజ్ కన్నప్ప సినిమాపై సెటైర్లు కూడా వేశారు. ఆ తర్వాత సారీ కూడా చెప్పారు. ఇప్పుడు ఈ సినిమాకి గుడ్ ఫీడ్ బ్యాక్ ఇవ్వడంతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.



# హీరోగా విజయ్ సేతుపతి వారసుడు

## ‘ఫీనిక్స్’ తో సూర్య సేతుపతి ఎంట్రీ






కోలీవుడ్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి వారసుడు సూర్య సేతుపతి హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. సూర్య సేతుపతి డెబ్యూ మూవీ ఫీనిక్స్. ఏకే బ్రేవ్‌మ్యాన్ పిక్చర్స్ ఈ సినిమాని సమర్పిస్తోంది. జూలై 4, 2025న ఈ చిత్రం థియేట్రికల్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఫేమస్ స్టంట్ మాస్టర్ అనల్ అరసు ఈ సినిమాని డైరెక్షన్ చేస్తున్నారు. ఈయన వార్ 2 సినిమాలో స్టంట్ మాస్టర్ గానూ పనిచేస్తున్నారు. ఈ సినిమాలో యాక్షన్ తో పాటు ఎమోషన్స్ సమానంగా ఉండేలా మేకర్స్ ప్లాన్ చేశారు. గతంలో సూర్య సేతుపతి నానుమ్ రౌడీ ధాన్, సింధుబాద్ వంటి సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా చేశారు. అయితే సూర్య సేతుపతి పూర్తిస్థాయిలో హీరోగా నటిస్తున్న సినిమా ఇది. ఈ సినిమాకి సామ్ సిఎస్ సంగీతాన్ని అందిస్తుండగా, వెల్‌రాజ్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కెఎల్ ఎడిటర్. టెక్నికల్ క్రూ బలంగా ఉండటంతో, ఫీనిక్స్‌పై అంచనాలు పెరిగాయి. ఈ సినిమాలోని “ఇంధ వంగికో” సాంగ్ ను విజయ్ సేతుపతి సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సాంగ్ ఆడియన్స్ ను ఆకట్టుకుంటోంది. బాబా భాస్కర్ కోరియోగ్రఫీ, వెల్‌రాజ్ అందించిన కలర్ ఫుల్ విజువల్స్, సూర్య సేతుపతి ఎనర్జిటిక్ డ్యాన్స్ తో పాట సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# ‘కన్నప్ప’ అదిరిందప్పా

### - మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ ఎలా ఉంది..?

విష్ణు మంచు హీరోగా నటించిన సినిమా ‘కన్నప్ప’. కథ రాసింది కూడా ఆయనే. శ్రీకాళహస్తి ఆలయ స్థల పురాణం ఆధారంగా తీసిన చిత్రమిది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఇందులో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు, కాజల్ అగర్వాల్ వంటి స్టార్స్ కీలక పాత్రలు చేశారు. విష్ణు సరసన ప్రీతి ముకుందన్ నటించారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో భారీ ఎత్తున విడుదలైన ఈ సినిమా ఎలా ఉంది? ఇందులో నటీ నటులు పెర్ఫార్మెన్స్ ఎలా ఉంది?




**కథ :**

బాల్యంలో తిన్నడు (విష్ణు మంచు) స్నేహితుడిని అమ్మవారికి బలి ఇస్తారు. అప్పటి నుంచి దేవుడు లేడని మొక్కడం మానేస్తాడు తిన్నడు . నాస్తికుడు అవుతాడు. తల్లి లేని బిడ్డ కావడంతో తండ్రి నాతనాథుడు (శరత్ కుమార్) కూడా కొడుకును ఏమీ అనడు. తమ అడవిలో మరో గూడెంలో ఉన్న వాయు లింగం కోసం వచ్చిన కాలాముఖుడి (అర్పిత్ రంక) తమ్ముడిని చంపేస్తాడు. లక్షల సైన్యంతో వచ్చే కాలముఖుడిని ఎదుర్కొనడం కోసం నాతనాథుడు అడవిలో మిగతా వాళ్ళ మద్దతు కోరతాడు. తాను ప్రేమించిన నెమలి (ప్రీతి ముకుందన్) మరో గూడెం పెద్ద కుమార్తె అని తిన్నడికి తెలుస్తుంది. దేవుడు లేడని చెప్పే తిన్నడిని నెమలితో ప్రేమ ఎలా మార్చింది? ఆ ప్రేమ వల్ల ఎటువంటి యుద్ధం చేయాల్సి వచ్చింది? ఎవరికి దూరం అయ్యాడు? కాల ముఖుడిని ఎదుర్కొనే సమయంలో తిన్నడు ఏం కోల్పోయాడు? తిన్నడు నుంచి ‘కన్నప్ప’గా ఎలా మారాడు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. కన్నప్ప చరిత్ర తెలుగు పేక్షకులకు కొత్త కాదు. శ్రీకాళహస్తి ఆలయానికి వెళ్లే భక్తుల సంఖ్య తక్కువ కాదు. భక్తి భావంతో కొందరు చరిత్ర తెలుసుకుంటే... కృష్ణంరాజు ‘భక్త కన్నప్ప’ చూసి తెలుసుకున్న ప్రేక్షకులు ఇంకొందరు. అందరికీ తెలిసిన కథను తెరపైకి తీసుకు రావడం అంత సులభం కాదు. అందులోనూ ‘బాహుబలి’ వంటి భారీ సినిమాలు చూసిన జనాలకు ఆ స్థాయిలో సినిమా అందించడం ఇంకా కష్టం. తెలిసీ విష్ణు మంచు రిస్క్ చేశారు. ఆ రిస్క్ ఎలా ఉంది? అంటే...శివపార్వతుల సన్నివేశంతో ‘కన్నప్ప’ మొదలైంది. చిన్నప్పటి నుంచి మనం విన్న, చదివిన, చూసిన కన్నప్ప కథేనా? అనే స్థాయిలో తెరపై గ్రాండియర్ విజువల్స్, లార్జ్ ల్యాండ్ స్కేప్స్, యాక్షన్ సీక్వెన్స్ కళ్ల ముందు మెదులుతాయి. ఓ కథకుడిగా, కథానాయకుడిగా, నిర్మాతగా ‘బాహుబలి’ రేంజ్ ఎక్స్‌పీరియన్స్ ఆడియన్స్‌కు ఇవ్వడానికి విష్ణు మంచు ట్రై చేశారు. ఆయన ప్రయత్నంలో నిజాయితీ ఉంది. కానీ, ఆ స్థాయిలో తెరపైకి తీసుకు రావడంలో ముఖేష్ కుమార్ సింగ్ అంతగా సక్సెస్ కాలేకపోయారనే చెప్పాలి. స్టార్స్ అందరినీ వాడుకున్న తీరు బావుంది. తెరపై అక్షయ్ - కాజల్, ప్రభాస్, మోహన్ లాల్, మోహన్ బాబు వచ్చిన ప్రతి సన్నివేశాన్ని బాగా తీశారు. ‘కన్నప్ప’ ఫస్టాఫ్ సోసోగా అనిపిస్తుంది. సెకండాఫ్ ప్రభాస్ ఎంట్రీ తర్వాత సినిమా స్వరూపం ఒక్కసారిగా మారింది. అది చివరి వరకు కంటిన్యూ అయ్యింది.సినిమాటోగ్రఫీ బావుంది. నిర్మాణంలో రాజీ పడలేదు. యాక్షన్ సీన్స్, ప్రభాస్ - విష్ణు మంచు సన్నివేశాల్లో నేపథ్య సంగీతానికి స్కోప్ ఉంది. కన్నప్ప’ను రెండు కోణాల్లో చూడాలి. చూసే ప్రేక్షకులలోనూ రెండు అభిప్రాయాలు ఉంటాయి. ఒకటి... భారీ స్థాయిలో ఎలా తీశారని! రెండు... భక్తి భావం ఎంత ఉందని! రెండు అంశాల్లోనూ సినిమా సర్‌ప్రైజ్ చేస్తుంది. శివ పార్వతుల మధ్య సంభాషణలు, పతాక సన్నివేశాల్లో విష్ణు మంచు - మోహన్ బాబు మధ్య సంభాషణలు బావున్నాయి. నటుడిగా విష్ణు మంచుసెటిల్డ్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. క్యారెక్టర్ కోసం ఆయన పడిన కష్టం తెరపై కనిపిస్తుంది. నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటన కంటే గ్లామర్ ఎక్కువ హైలైట్ అవుతుంది. సినిమాలో నటీనటులు అందరూ ఒకెత్తు... ప్రభాస్ ఒక్కరే ఒకెత్తు! ఎంట్రీ నుంచి ఎండ్ వరకు ప్రభాస్ తెరపై కనిపించిన ప్రతిసారీ ఒక వైబ్ క్రియేట్ అవుతుంది. ఆ పాత్రకు ప్రభాస్ వంద శాతం న్యాయం చేశారు. ప్రభాస్‌ను ‘నీకు పెళ్లయిందా?’ అని విష్ణు అడిగే సన్నివేశానికి థియేటర్లు దద్దరిల్లడం ఖాయం. మోహన్ బాబును డైలాగ్ కింగ్ అని ఎందుకు అంటారో, నటుడిగా ఆయన ప్రతిభను ఈతరం ప్రేక్షకులకు సైతం చెప్పే చిత్రమిది. మోహన్ లాల్ ఒక్క సీన్ చేశారు.

అక్షయ్ - కాజల్ జంట శివ పార్వతులుగా ఒదిగిపోయారు. శరత్ కుమార్ నటన బావున్నా... డబ్బింగ్ ఇబ్బంది పెట్టింది. ప్రభాస్ కోసం వెళ్లిన అభిమానులు కావచ్చు, అక్షయ్ కుమార్ - మోహన్ లాల్ వంటి స్టార్స్ కోసం వెళ్లిన ప్రేక్షకులు కావచ్చు... థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు క్లైమాక్స్ లో విష్ణు మంచు నటన గురించి తప్పకుండా మాట్లాడతారు. నటుడిగా ఒక ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. విష్ణు కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మన్స్ అని చెప్పడంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. ప్రేక్షకులు ఏమీ ఆశించకుండా వెళితే సర్‌ప్రైజ్ చేస్తుంది. అంచనాలతో వెళితే శాటిస్‌ఫై చేస్తుంది. ప్రభాస్ స్క్రీన్ ప్రజెన్స్, ఆయన క్యారెక్టర్ - క్లైమాక్స్ - విష్ణు నటన థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా గుర్తు ఉంటాయి.

## రజనీకాంత్ ‘కూలీ’

# టైటిల్ చేంజ్




తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ లేటెస్ట్ మూవీ ‘కూలీ’. ఇప్పటికే ఆ సినిమాపై ఫ్యాన్స్ , ఆడియన్స్ లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను పాన్ ఇండియా భాషల్లో గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు. అయితే, ఈ సినిమాకు హిందీలో ‘కూలీ’ టైటిల్ విషయంలో కాంట్రవర్సీ రేగింది. ఇప్పటికే హిందీలో ‘కూలీ’ అనే టైటిల్ రిజిస్టర్ అయి ఉండటంతో అక్కడ ఈ సినిమాను ‘మజ్దూర్’ అనే టైటిల్‌తో రిలీజ్ చేస్తారనే టాక్ వినిపించింది. అయితే ఇప్పుడు ‘కూలీ %-% ది పవర్‌హౌస్’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు మేకర్స్ వెల్లడించారు. అలాగే లేటెస్ట్ గా ఓ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. రజనీకాంత్ తో పాటు ఈ సినిమాలో కింగ్ నాగార్జున, కన్నడ స్టార్ ఉపేంద్ర, శ్రుతి హాసన్ నటిస్తున్నారు. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా సన్ పిక్చర్స్ బ్యానర్ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. ‘కూలీ’ ఆగస్టు 14న వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.



# ఒక్క ఛాన్స్ ప్లీజ్ !! మృణాల్ ఠాగూర్

మరాఠీ బుల్లితెరపైకి ఎంట్రీ ఇచ్చిన మృణాల్, తర్వాత బాలీవుడ్ లో హీరోయిన్ గా నటించింది. కానీ ఆమెకు క్రేజ్ వచ్చింది మాత్రం... తెలుగు సినిమా సీతారామంతోనే. సీతామహాలక్ష్మి పాత్రలో అదుర్స్ అనిపించింది. ఆ తర్వాత హాయ్ నాన్న కూడా హిట్ కొట్టింది. ఇక మూడో సినిమా ఫ్యామిలీ స్టార్ ఫ్లాప్ అవడంతో మృణాల్ కి అవకాశాల్లేవు. అడివి శేష్ నటిస్తున్న డెకాయిట్ లో శృతిహాసన్ ఎగ్జిట్ అవడంతో ఆమెకు ఛాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్నా... తమిళ్ లో ఆఫర్లు వస్తున్నాయంటున్నారు.



















# స్వేచ్ఛకి అశ్రునివాళి

## టీవీ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య

తెలుగు టీవీ యాంకర్, న్యూస్ ప్రెజెంటర్, వర్ధమాన కవయిత్రి స్వేచ్ఛ వొరాట్కర్ ఆత్మహత్య చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె తన తల్లి శ్రీదేవితో కలిసి రామ్ నగర్ లో నివాసం ఉంటుండగా జవహర్ నగర్ లోని తన నివాసానికి వెళ్లి ఉరివేసుకొని చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఆమె బాడీని గాంధీ ఆసుపత్రికి తరలించారు... స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకున్న సమాచారం తెలుసుకున్న స్నేహితులు, సన్నిహితులు భారీగా ఆసుపత్రికి చేరుకున్నారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. స్వేచ్ఛ గత 18 సంవత్సరాలుగా పలు ప్రముఖ టీవీ ఛానల్స్ లో యాంకర్ గా పనిచేస్తున్నారు. గతంలో టీవీ9లోనూ, ప్రస్తుతం టీ న్యూస్ లోనూ పనిచేస్తున్న స్వేచ్ఛ ఉత్తమ























